

వీడని కాజ్‌వే కష్టాలు

- పనులు పూర్తికాకుండానే వాహనాలకు అనుమతి
- వర్షంతో బురదగా మారిన కాజ్‌వే
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- కాజ్‌వే అందుబాటులోకి వచ్చినా తొలగని అవస్థలు

-8లో

గ్రామాల్లో స్వచ్ఛతకు ప్రాధాన్యం

ప్రజల భాగస్వామ్యంతోనే సాధన

శత శాతం పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలి

- కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపు
- 'స్వచ్ఛ ఆంధ్ర-2025' జిల్లా స్థాయి అవార్డుల ప్రదానం



గ్రీన్ అంబాసిడార్‌కు అవార్డు అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ. చిత్రంలో ఎమ్మెల్యే బండారు, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద, మళ్ల సురేంద్ర, అధికారులు, కూటమి నాయకులు వున్నారు.

అనకాపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): **ప్రజల సహకారంతో 'స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యం నెరవేరుతుందని, దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. సోమవారం అనకాపల్లిలోని ఒక ప్రైవేటు కన్వెన్షన్ హాలులో జరిగిన 'స్వచ్ఛ ఆంధ్ర-2025' జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.**

స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలని, చెత్తను రోడ్లపై, ఆరుబయట పడేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్‌లకు అందించి సహకరించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు పొందేందుకు కృషి చేసిన ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఆమె అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నూరు శాతం పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్న స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ

... మిగతా 6వ పేజీలో



విజయవాడలోని తుమ్మపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి స్వచ్ఛ పీహెచ్‌సీ అవార్డును సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకుంటున్న కె.కోటపాడు మండలం చౌడువాడ ఆస్పత్రి వైద్యులు



ప్రత్యేక రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

తిరుపతి స్పెషల్‌కు ఆదరణ

- అన్నీ థర్డ్ ఏసీ బోగీలతో అనకాపల్లి నుంచి ప్రత్యేక రైలు
- చాలా వరకు బెర్త్‌లు ఫుల్
- హంసఫర్ శ్రేణి రైలు కావడంతో 25 శాతం అధిక చార్జీలు
- సాధారణ, సెకండ్ క్లాస్ స్లీపర్ బోగీలు లేకపోవడంపై ప్రయాణికుల అసంతృప్తి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-తిరుపతి మధ్య దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రవేశపెట్టిన వీక్లీ ప్రత్యేక రైలు సేవలు సోమవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. అయితే అన్నీ థర్డ్ ఏసీ బోగీలు మాత్రమే వుండడంతో సాధారణ ప్రయాణికులు నిరాశ చెందారు. హంసఫర్ శ్రేణికి చెందిన రైలు కావడంతో సాధారణ చార్జీలతో పోలిస్తే 25 శాతం అధికంగా వుంది. అయినప్పటికీ సోమవారం సాయంత్రం ఇక్కడి నుంచి బయలుదేరిన రైలులో చాలా వరకు బెర్త్‌లు నిండాయి. అనకాపల్లితోపాటు కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్, గాజువాక, విశాఖపట్నం నుంచి పలువురు ప్రయాణికులు ఇక్కడకు వచ్చి ప్రత్యేక రైలులో తిరుపతి బయలుదేరి వెళ్లారు. మొత్తం 19 బోగీలతో తిరుపతి నుంచి 07481 నంబర్‌తో నడిచే ఈ రైలు ప్రతి ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు అక్కడ బయలుదేరి సోమవారం ఉదయం 9.30 గంటలకు విశాఖ చేరుతుంది. శ్రీకాళహస్తి, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, ఎలమంచిలి స్టేషన్లలో ఈ రైలుకు హాల్ట్‌లు వున్నాయి. అనకాపల్లి నుంచి సోమవారం సాయంత్రం 5.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం (మంగళవారం) 7.40 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుపతి నుంచి ఈ నెల 12, 19, 26 తేదీల్లో, అనకాపల్లి నుంచి 13, 20, 27 తేదీల్లో ఈ ప్రత్యేక రైలు

... మిగతా 6వ పేజీలో

అన్నదాతకు ఆదా

జీఎస్టీ 2.0 సంస్కరణలతో 13 శాతం వరకు తగ్గిన పన్నుల భారం



ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో వ్యవసాయ యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ (ఫైల్ ఫొటో)



వ్యవసాయ పరికరాలపై తగ్గిన జీఎస్టీ గురించి రైతులకు అవగాహన కోసం ట్రాక్టర్‌కు కట్టిన ఫ్లెక్సీ

- అందుబాటు ధరల్లో యంత్ర పరికరాలు, వస్తు సామగ్రి, జీవన ఎరువులు
- 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' పేరుతో గ్రామాల్లో అవగాహన సదస్సులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ రంగంలో వినియోగించే వివిధ రకాల యంత్రాలు, పరికరాలు, సామగ్రి, ఎరువులు, పురుగు మందులపై పన్నులు తగ్గించి రైతులకు ఖర్చులను ఆదా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ-2.0 సంస్కరణలు అన్నదాతలకు ఎంతో మేలు చేస్తున్నాయి. జీఎస్టీ తగ్గుదలపై కలుగుతున్న ఆర్థిక ప్రయోజనాల గురించి ప్రభుత్వం 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' నినాదంతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. వ్యవసాయ రంగంలో ఎరువులు, సూక్ష్మపోషకాలు, జీవసంబంధమైన పురుగు మందులపై గతంలో 12 శాతం జీఎస్టీ వుండేది. గత నెల 22వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ సంస్కరణలతో వీటిపై పన్ను ఐదు శాతానికి తగ్గింది. ఇక ట్రాక్టర్ విడిభాగాలపై గతంలో ఉన్న 18 శాతం జీఎస్టీని ఇప్పుడు ఐదు శాతానికి తగ్గించారు. గతంలో 1800 సీసీ కంటే ఎక్కువ ఇంజన్ సామర్థ్యం కలిగిన పవర్ టిల్లర్లపై జీఎస్టీ 12 శాతం వుండగా, దీనిని కూడా ఐదు శాతానికి తగ్గించారు. గతంలో బేసిక్ మోడల్ వ్యవసాయ ట్రాక్టర్ ధర

... మిగతా 6వ పేజీలో

నాడు అలా.. నేడు ఇలా..

- రూ.కోటితో స్టేషన్‌రోడ్డు అభివృద్ధి
- ప్రజలకు తొలగిన ఇబ్బందులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి విస్తరణ, అభివృద్ధికి నోచుకోక, రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన స్టేషన్‌రోడ్డు ఎట్టకేలకు బాగుపడింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రత్యేక దృష్టి సారించి మెయిన్‌రోడ్డులో పెరుగుబజార్ జంక్షన్ నుంచి రింగ్‌రోడ్డులో గాంధీబొమ్మ జంక్షన్ వరకు సుమారు రూ.కోటితో అభివృద్ధి చేయించారు. ఈ మార్గంలో కిరాణా, బంగారం, ఫ్యాన్సీ, రెడీమేడ్ వస్త్ర వ్యాపారాలతో రద్దీగా ఉండేది. ఇరుకుగా, గోతులతో నిండిన ఈ రోడ్డు చాలా అధ్వానంగా వుండేది. ముఖ్యంగా చిన్నవీధికి, చేపల బజారుకు వెళ్లే జంక్షన్ దారుణంగా వుండేది. కొద్దిపాటి వర్షం కురిసినా నీరు చేరి పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో స్థానికులు చక్కగా రాకపోకలు సాగిస్తున్నారు. సత్వరమే అభివృద్ధి పనులు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు అభినందిస్తున్నారు.



అభివృద్ధి చేయక ముందు రహదారి పరిస్థితి (ఫైల్ ఫొటో)



రూ.కోటితో అభివృద్ధి చేసిన తరువాత..

సముద్రంలో పాలిటెక్నిక్ విద్యార్థి గల్లంతు

- పాల్మన్‌పేట తీరంలో ఘటన
- సొంతూరు కోటవురట్ల మండలం కె.వెంకటాపురం

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాల్మన్‌పేట వద్ద సోమవారం ఒక విద్యార్థి సముద్రంలో గల్లంతయ్యాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ పురుషోత్తం అందించిన వివరాలిలా వున్నాయి. కోటవురట్ల మండలం కె.వెంకటాపురం గ్రామానికి చెందిన 12 మంది విద్యార్థులు సోమవారం పాయకరావుపేట మండలం పాల్మన్‌పేట సముద్ర తీరానికి ఆటోలో వచ్చారు. ఇక్కడ నీటిలో దిగి సరదాగా గడుపుతుండగా ఆకస్మాత్తుగా పెద్ద కెరటం ఎగిసిపడింది. దీంతో పోలుపర్తి అశోక్ (19) నీటిలో మునిగిపోయి గల్లంతయ్యాడు. మిగిలిన వారు నీటిలో దిగి కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, మెరైన్ పోలీసుల సహకారంతో గజఈతగాళ్లను రప్పించారు. బోటు సాయంతో చీకటి పడేవరకు గాలించినా అశోక్ ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం మరోసారి గాలింపు చర్యలు చేపడతామని ఎస్ఐ పురుషోత్తం చెప్పారు. గల్లంతైన విద్యార్థి అశోక్ నర్సీపట్నంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు.



గల్లంతైన పోలుపర్తి అశోక్ (ఫైల్ ఫొటో)

రోడ్డెక్కిన డ్వాక్రా మహిళలు

- గోవాడలో స్టేట్ బ్యాంకు ఎదుట ఆందోళన
- రుణాల స్వాహా పర్వంలో నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్
- బ్యాంకు తెరవకుండా అడ్డగింత
- రంగంలోకి పోలీసులు, రాజకీయ నేతలు
- డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని బ్యాంకు అధికారులకు సూచన
- ఆందోళన విరమించిన మహిళలు
- వెలుగు వీవోఏపై కేసు నమోదు చేసిన పోలీసులు



గోవాడ స్టేట్ బ్యాంకు ఎదుట బైఠాయించిన డ్వాక్రా మహిళలు


చోడవరం, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): తమ పేరుతో బ్యాంకు నుంచి రుణాలు మంజూరు చేసి, బినామీ ఖాతాలకు మళ్లించుకుని స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, అదే విధంగా తమకు 'నో డ్యూస్ సర్టిఫికెట్' జారీ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని సింహాద్రిపురం గ్రామానికి చెందిన

... మిగతా 6వ పేజీలో

కల్యాణపులోవకు వరద పోటు

- రెండు గేట్లు ఎత్తి 300 క్యూసెక్కులు విడుదల

రావికమతం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు కాగా, పరీవాహక ప్రాంతమైన ఏజెన్సీలో కురుస్తున్న భారీ వర్షాలతో 350 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. దీంతో సోమవారం నీటి మట్టం 458.6 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా స్పిల్‌వేలో రెండు గేట్లు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడిచిపెడుతున్నారు. నదికి ఇరువైపులా వున్న రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాల్లోని చీమలపాడు, జడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, కొత్తకోట, కన్నంపేట, జగ్గంపేట, జె.నాయుడుపాలెం, కొమరవోలు, ఆర్.కొత్తూరు, కుసర్లపూడి, తూటిపాల, తాడపాల, కొండల అగ్రహారం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ డి.సూర్య కోరారు.



కల్యాణపులోవ రిజర్వాయర్ గేట్ల నుంచి నదిలోకి విడుదల చేస్తున్న నీరు

ఎన్నాళ్లీ కష్టాలు!

- వర్షాలతో దారుణంగా తయారైన వడ్డాది- పాడేరు రోడ్డు
- అడుగడుగునా గోతులతో ప్రయాణికుల ఇక్కట్లు

మాడుగుల రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు వడ్డాది-పాడేరు రోడ్డులో ప్రయాణమంటే వాహన చోదకులు, ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. వడ్డాది జంక్షన్ నుంచి మండల పరిధిలో తాటిపర్తి వరకు పలుచోట్ల భారీ గోతులు ఏర్పడి, రహదారి ఛిద్రమైంది. రాళ్లు, కంకర తేలిపోయాయి. గోతుల్లో వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. 20 నిమిషాల్లో ప్రయాణించాల్సిం చాల్సి వుండగా గంటకుపైగా సమయం పడుతున్నదని వాహనదారులు వాపోతున్నారు. పైగా ఒళ్లు హూనమవ్వడంతో పాటు వాహనాల విడిభాగాలు పాడైపోతున్నాయని అంటున్నారు. ఈ మార్గంలో నిత్యం పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, కార్లు, జీపులు, ఆటోలు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వాహనాల్లో వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ముకుందపురం, కేజేపురం, ఎం.కోటపాడు, డి.సురవరం, సాగరం, ఎం.కోడూరు, కాశీపురం గ్రామాల వద్ద ఏర్పడిన గోతుల కారణంగా వీరంతా ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా రోడ్డు వేయడం మాట అటుంచి.. కనీసం గోతులైనా కప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ముకుందపురం వద్ద రోడ్డు మొత్తం గోతులే!



కేజేపురం- ఎం.కోటపాడు మధ్య పూర్తిగా ఛిద్రమైన రహదారి

'ఆంధ్రజ్యోతి' కి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



Admissions are in Progress
Trades Offered:
Electrician, Fitter & Welder
HI-TECH ITI
(Approved by DGT and Affiliated to NCVT, New Delhi)
Since 36 Years in Service
Manthripalem, Near Lankelapalem Jn., Anakapalli-531019
Contact : 0891-240118 9247158595, 9989475691
Website: hightechprivate.com Email: hightechitivizag@gmail.com

కోటవురట్లలో కవయిత్రి మొల్ల విగ్రహ ఆవిష్కరణ



కవయిత్రి మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు, గ్రామ పెద్దలు

కోటవురట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల శివారు రాట్నాలపాలెంలో కవయిత్రి ఆతుకూరి మొల్ల విగ్రహాన్ని కోనసీమ జిల్లా శాలిహన కమ్యూనిటీ డైరెక్టర్ విజయకుమారి, టీడీపీ మండల నాయకులు జానకి శ్రీనివాసరావు, హరిబాబు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జానకి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంస్కృత భాషలో ఉన్న వాల్మీకి రామాయణాన్ని సరళమైన తెలుగు భాషలోకి మొల్ల అనువదించారన్నారు. కుమ్మరి వృతికి చెందిన ఆమె తెలుగుసాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. మాజీ ఉప సర్పంచ్ దాసరి వెంకట్రావు, ఉపసర్పంచ్ గవ్వా రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో కైట్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన కైట్స్ విద్యార్థులతో కరస్పాండెంట్ గణేశ్

అచ్యుతాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కైట్స్ విద్యావిహార్‌లో తొమ్మిది చదువుతున్న డి. శరణ్య జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల కరస్పాండెంట్ రెడ్డి గణేశ్ తెలిపారు. ఈనెల పది నుంచి 14వ తేదీ వరకు రాంచీలో జరిగే పోటీల్లో శరణ్య పాల్గొంటాడన్నారు. అలాగే తొమ్మిది చదువుతున్న వి. సందీప్ రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈనెల 24వ తేదీన విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటాడన్నారు. అండర్-14 విభాగంలో కె. సాహితి విశాఖపట్నంలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్కేటింగ్‌లో స్టేట్ మీట్‌కు ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

రాజపుత్ర సమాజ్ కార్యవర్గం

అచ్యుతాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా రాజపుత్ర సమాజ్ నూతన అధ్యక్షుడిగా దంతులూరి దిలీప్ కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సోమవారం ఇక్కడ జరిగిన సమావేశంలో కార్యదర్శిగా రాంబిల్లికి చెందిన కిషోర్‌రాజు, కోశాధికారిగా మంతెన లీలావతి, ఉపాధ్యక్షులుగా మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, పిన్నమరాజువాసులతో పాటు బీఎస్ఆర్‌పి వర్మ, పి. నరసింహరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దార్లపూడి హైస్కూల్‌కు క్రీడా పరికరాల వితరణ



హెచ్‌ఎంకు క్రీడా పరికరాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి జడ్పీ హైస్కూల్‌లో 1994-95 పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సమకూర్చిన క్రీడా పరికరాలు, కాంపిటేటివ్ పుస్తకాలను సోమవారం హెచ్‌ఎం జాన్‌కు అందజేశారు. పూర్వ విద్యార్థులంతా రూ.11 వేలతో వీటిని సమకూర్చారు. హైస్కూల్‌లో చదువుకొని 30 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా వీటిని అందజేశారు.

గృహ నిర్బంధంలో సీపీఎం నేత అప్పలరాజు

ఎస్.రాయవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును సోమవారం రెండో రోజూ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. దీంతో రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్స్ పార్కు ఏర్పాటు చేయొద్దంటూ ఆందోళన చేస్తున్న మత్స్యకార సంఘ నేతలు వెళ్లి కలిశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం. సత్యనారాయణ, ఎం రాజేష్, బల్క్‌డ్రగ్స్ పార్కు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి పీజీఆర్‌ఎస్ దోహదం'



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహశీల్దార్, ఎంపీడీవో

నక్కపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎంతో ఉపయోగపడుతుందని తహశీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో డీ సీతారామరాజు చెప్పారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. భూముల రికార్డులు, పలు ధ్రువీకరణపత్రాలు, రేషన్‌కార్డులు, మంచినీటి సరఫరా, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకపోయినా ఫిర్యాదు చేస్తే, పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. సోమవారం పలు సమస్యలకు సంబంధించి 14 ఫిర్యాదులు స్వీకరించారు.

తగ్గిన వ్యవసాయ పరికరాల ధరలు

▸▸ టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్

మునగపాక, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గడంతో వ్యవసాయ పరికరాలు ధరలు బాగా తగ్గాయని టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీల కొరత కారణంగా వ్యవసాయరంగంలో ప్రతి పనికి పరికరాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇటువంటి తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతన్నకు భరోసాగా నిలుస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ విల్లూరి నూకనర్సింగరావు, కాండ్రేగుల శంకర్, సూరిశెట్టి అప్పలనాయుడు, మళ్ల వరహానర్సింగరావు, బీలా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో భారీ వర్షం



కోటవురట్లలో వర్షం

కోటవురట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం నుంచి భానుడు భగ్గుమన్నాడు. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం నాలుగు గంటలయ్యేసరికి వాతావరణం మార్పులతో చిరుజల్లులుగా ప్రారంభమై భారీవర్షం కురిసింది. ఈ వర్షానికి కాలువల్లో చెత్తచెదారం కొట్టుకుపోయింది. మండలంలో పలుగ్రామాల్లో వరి పంటకు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం తెగుళ్ల నివారణకు దోహదపడుతుందని రైతులు ఆశిస్తున్నారు. సాగులో ఉన్న పత్తి, వరి, కూరగాయలు, తదితర పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు అంటున్నారు.

సమష్టిగా నియోజకవర్గ అభివృద్ధి

ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

నెలలో రెండు రోజులు గ్రామాల్లో పర్యటన

పల్లెల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలి

అచ్యుతాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గం అభివృద్ధికి అంతా సమిష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం స్థానికంగా ఉన్న తన నివాసంలో నియోజకవర్గం అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. నెలలో రెండు రోజులు ప్రతి గ్రామంలో ఉదయం ఏడు నుంచి పర్యటించి సమస్యలు గ్రామప్రజలనే నేరుగా అడిగి తెలుసుకుంటానన్నారు. ఈలోగా అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో పారిశుధ్యంతో పాటు తాగునీటికి కొరత రాకుండా చూడాలన్నారు. అచ్యుతాపురం జంక్షన్‌లో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో పాటు అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు. రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నందున ట్రాఫిక్‌కి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ స్తంభాల మార్పిడి జరగాలన్నారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

నాఫ్ సెంట్రల్ కమిటీ చైర్మన్ దృష్టికి మత్స్యకారుల సమస్యలు

▸▸ ఏపీ నాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు

పాయకరావుపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో రసాయన పరిశ్రమలు ఏర్పాటుతో వేలాది మత్స్యకార కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను నాఫ్ సెంట్రల్ కమిటీ ఛైర్మన్ నందకుమార్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఏపీ నాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు తెలిపారు. సోమవారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ రాయపూర్‌లో జరిగిన జాతీయ మత్స్యకార సంఘం సెంట్రల్ కమిటీ సమావేశంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు వ్యతిరేకంగా రాజయ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న ఆందోళనను ప్రస్తావించానన్నారు. అదేవిధంగా కాకినాడ జిల్లా తీరప్రాంతంలో అరవింద్ దివీస్ పరిశ్రమ ఏర్పాటు చేయడంతో పలు గ్రామాల్లో వేలాది కుటుంబాలకు తీవ్ర నష్టం జరుగుతోందని, వీటికి వ్యతిరేకంగా చేపడుతున్న ఆందోళనల్లో నాఫ్ పాల్గొనడం జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో ఈ రెండు ప్రాంతాల్లో నాఫ్ సెంట్రల్ కమిటీ పర్యటించి మత్స్యకారుల సమస్యలు తెలుసుకుంటుందన్నారు. ఈ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకునివెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మోసా అప్పలరాజు తెలిపారు.



నాఫ్ సెంట్రల్ కమిటీ చైర్మన్ నందకుమార్‌తో మాట్లాడుతున్న ఏపీ నాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు

ఎలమంచిలి పారిశుధ్య కార్మికులకు అవార్డులు



జిల్లా కలెక్టరు విజయ్ కృష్ణన్, ఎమ్మెల్యేల సమక్షంలో అవార్డులు అందుకుంటున్న పారిశుధ్య కార్మికులు

ఎలమంచిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో విశేష సేవలు అందించిన ఎలమంచిలి మునిసిపాలిటీకి చెందిన ఇద్దరు పారిశుధ్య కార్మికులకు జిల్లా స్థాయి అవార్డులు అందుకున్నట్టు శానిటరీ ఇన్‌స్పెక్టరు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు విజయ్ కృష్ణన్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర ప్రతినిధులు గోవింద సత్యనారాయణ తదితరుల చేతుల మీదుగా కాండ్రకోట వెంకటేష్, జి.వరలక్ష్మి అవార్డులు అందుకున్నారన్నారు. వారిద్దరికి అవార్డులు రావడం పట్ల మునిసిపల్ అధికారులు అభినందనలు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు

▸▸ మునిసిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జీఎస్టీ 2.0 విధానంతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని మునిసిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో అధికారులు, కౌన్సిల్ సభ్యులు, వ్యాపారులతో కలిసి నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజల్లో ఎంతో ఆనందం వ్యక్తమవుతుందన్నారు. ప్రభుత్వ విధానాలు ప్రజారంజకంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా అధికారులంతా కలిసి పట్టణంలో జిమ్‌లు, బ్యూటీ సెలూన్లు తదితర వ్యాపార సముదాయాలకు వెళ్లి అవగాహన కల్పించారు. జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గింపుపై అవగాహన కల్పించారు. అంతకుముందు జీఎస్టీ తగ్గింపుపై కరపత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అధికారి స్వర్ణలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మెప్మా సిటీ మేనేజరు పద్మావతి, కౌన్సిలర్ బీబీ, తదితరులు పాల్గొన్నారు.



జీఎస్టీ తగ్గుదల కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఛైర్‌పర్సన్ రమాకుమారి, మునిసిపల్ అధికారులు

పిడుగుపడి పశువుల పాక దగ్ధం

▸▸ పాడి గేదె దహనం

ఎలమంచిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తెరువుపల్లి గ్రామంలో పశువుల పాకపై పిడుగు పడి పాడి గేదె దహనం అయ్యింది. గ్రామానికి చెందిన పాడి రైతు తుమ్మపాల పైడికొండ తన పాడిగేదెను పశువుల పాకలో కట్టాడు. రాత్రి కురిసిన వర్షానికి పూరిపాకపై పిడుగు పడడంతో మొత్తం అగ్నికి ఆహుతయ్యింది. దీంతో పాడి గేదె కాలిపోయి మృతి చెందినట్టు రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. పాడిగేదె చూలుతో ఉందని, మరో రైతుకు రూ.95 వేలకు విక్రయించానని, రూ. 5 వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నానని పైడికొండ తెలిపారు. పాడిగేదె మృతి చెందడంతో తోటి రైతులు సైతం ఆవేదనకు గురయ్యారు.



మృతి చెందిన గేదె వద్ద రోదిస్తున్న రైతు పైడికొండ

హోరాహోరీగా జిల్లాస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు

▸▸ రాష్ట్ర స్థాయి బాలురు, బాలికల జట్లు ఎంపిక

ఎస్.రాయవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం రేవుపోలవరం తీరంలో నిర్వహించిన విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో అండర్-17 విభాగంలో 24 బాలురు జట్లు, 13 బాలికల జట్లు పాల్గొనగా.. అలాగే అండర్-14 విభాగంలో పది బాలురు జట్లు, ఏడు బాలికల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను ఎంపీపీ కె వెంకటలక్ష్మి ప్రారంభించారు. అనంతరం జరిగిన పోటీల్లో అండర్-14 బాలురు విభాగానికి దారబోయిన సుశాంత్(గుడివాడ), గుమ్మడి కిశోర్ (లంకెలపాలెం), గొట్టల అశ్మిత్(గుంటపల్లి), దేవర సుధీర్(గుడివాడ) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో బురిడి పవిత్ర (అచ్యుతాపురం), ద్రాక్షరపు రాణి (గుంటపల్లి), ఎస్.జ్యోషిక (అచ్యుతాపురం), డి బాలశ్రీ (గుంటపల్లి) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే అండర్-17 బాలురు విభాగంలో బి.విజయ్ (అచ్యుతాపురం), షేక్ నౌషాద్ (దార్లపూడి), దిమిలి యోగి (దార్లపూడి), సీహెచ్ మనికంఠ (రేవుపోలవరం) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా.. బాలికల విభాగంలో వొమ్మి చరిష్మ (విశాఖ), పోలిశెట్టి పావని (పెదగుమ్ములూరు), ఎస్.చంద్రకళ (గన్నవరం), బొజ్జ అలేఖ్య (పెదగుమ్ములూరు) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా ఈనెల 19, 20, 21 తేదీల్లో బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులకు కోరుప్రోలు హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్ భోజన సదుపాయాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ గుర్రం రామకృష్ణ, టీడీపీ నాయకులు ఎన్. వెంకటరాజు, కోడా లోవరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రేవుపోలవరం తీరంలో నిర్వహిస్తున్న బీచ్ వాలీబాల్ పోటీలు

సూపర్ జీఎస్‌టీపై వ్యాస రచన పోటీలు

పాయకరావుపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం సూపర్ జీఎస్టీపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సంద్భంగా ఎంఈఓ-2 జి.రమేష్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై మండల స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో పలు హైస్కూళ్ల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారు మంగళవారం కశింకోట డీపీఎన్.హైస్కూల్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం మురళి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాకలో..

దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవ్స్ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించినట్టు ఎంఈవోలు డి.వేణుగోపాలరావు, బుద్ధ శివనాయుడు తెలిపారు. మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. వ్యాసరచన పోటీల్లో బొడ్డేడ సునిత, బి.డాలి వర్షిత ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. డ్రాయింగ్ పోటీలో ఎస్.మానసలక్ష్మి, మళ్ల జయ సుదర్శిని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు కర్రి లక్ష్మీనారాయణ, రాపేటి సత్తిబాబు, బి.అచ్యుతకృష్ణ పాల్గొన్నారు.

కోటవురట్లలో..

కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జీఎస్టీ శ్లాబ్ శాతం తగ్గించడంతో అన్ని వస్తువుల ధరలు తగ్గినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యాడ సుకుమార్ తెలిపారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో విజేతలను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. టీచర్స్ వీ డేవిడ్, ప్రసాద్, డ్రాయింగ్ టీచర్ సామాల కిశోర్, జనపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కోటవురట్లలో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లిలో..

జీఎస్‌టీ అమలు, దేశ ఆర్థిక సంస్కరణల అవగాహనా వారోత్సవాల్లో భాగం సోమవారం మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎంఈవో కె.నరేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు వేసిన చిత్రాలు విశేషంగా అలరించాయి. హెచ్‌ఎం పి.విజయ, ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, టీవీ రమణ, ఎ.సత్యవతి, పట్టా వరలక్ష్మి, శేషగిరిరావు, డి.శ్రీనివాసరావు, బీ నాయుడు, మోహన్ పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపండి

అధికారులకు ఆర్డీవో రమణ ఆదేశం

నర్సీపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని ఆర్డీవో వీవీ రమణ ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మునిసిపాలిటీలోని పబ్లిక్ కొళాయిల నుంచి బురద నీరు వస్తున్నదని ఏడో వార్డు పరిధిలోని కొత్తవీధికి చెందిన పలువురు మహిళలు ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. సీసాలో బురద నీరు తీసుకువచ్చి చూపించారు. వార్డులో చెత్తాచెదారం పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సమస్యను సత్వరమే సమస్య పరిష్కరించాలని మునిసిపల్ మేనేజర్ నాగరాజుకు ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు. అలాగే వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 14 అర్జీలు వచ్చినట్టు కార్యాలయం సిబ్బంది చెప్పారు. అత్యధికంగా భూ సమస్యలు, వివాదాలపై ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు.



కొళాయిలలో బురద నీరు వస్తుందని ఆర్డీవో రమణకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ఏకగ్రీవ ప్రోత్సాహకాలు అందించరూ..

జిల్లా కలెక్టర్‌కు సర్పంచుల వినతి

చీడికాడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు పంచాయతీలు ఏకగ్రీవమై నాలుగున్నర సంవత్సరాలు పూర్తయినా ఏకగ్రీవ ప్రోత్సాహక నిధులు రాలేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జేబీ.పురం, ఎ.అగ్రహారం, శిరిజాం, దండిసురవరం, పెదగోగాడ పంచాయతీల సర్పంచులు గొల్లవిల్లి చిన్నమ్మలు, కన్నూరు సత్యవతి, సలాది ధనలక్ష్మి, కోన అర్జునతో పాటు వార్డు సభ్యులు గొల్లవిల్లి రాజబాబు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి లిఖితపూర్వకంగా సమస్యను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా పంచాయతీల్లో ఎటువంటి గొడవలు లేకుండా ఏకగ్రీవంగా పాలకవర్గాలను ఎన్నుకుంటే రూ.5 నుంచి రూ.7 లక్షల వరకు అభివృద్ధి కోసం నిధులు ప్రత్యేకంగా కేటాయిస్తామని చెప్పిన అధికారులు నేటికీ ఇవ్వలేదన్నారు. మరో ఆరు నెలల్లోగా ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున వెంటనే నిధులు మంజూరు చేయాలని వారు కోరారు.



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ సూరిబాబు, చిత్రంలో డీసీఎంఎస్ చైర్మన్ బాలాజీ తదితరులు

అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆటంకం

▸▸ అనకాపల్లి మండల సమావేశంలో సభ్యులు ఆందోళన

▸▸ సభ దృష్టికి గ్రామాల్లో నెలకొన్న సమస్యలు

తుమ్మపాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యం అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా నిలుస్తోందని పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన అనకాపల్లి మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. ఈ సం దర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ అధికారుల పనితీరును ఎండగట్టారు. తుమ్మపాల ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జల్ జీవన్‌మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ తాగునీరు అందించే పథకానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారన్నారు. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా నత్తనడకన సాగుతున్నాయని వాపోయారు. గ్రామంలో పైప్‌లైన్ల కోసం ఎక్కడికక్కడ గోతులు తవ్వేసి పూడ్చకుండా వదిలేశారన్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే రైతులకు అవసరమైనంత యూరియా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బవులవాడ ఎంపీటీసీ తోటాడ విజయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లోపాలను సరిచేయాలని కోరారు. భట్లపూడి పంచాయతీ సర్పంచ్ సజావతి మాట్లాడుతూ పంచాయతీకి కార్యదర్శి లేకపోవడంతో పంచాయతీ పరిధిలో పనులు జరగడం లేదన్నారు. చాలా మంది సభ్యులు రెవెన్యూ సమస్యలపై ధ్వజమెత్తారు. ప్రతి పంచాయతీ పరిధిలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నా పరిష్కరించేవారు కరువయ్యారన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ మాట్లాడుతూ అధికారులు తీరు మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధుల ద్వారా మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామన్నారు.

జిల్లాకు మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలను పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని పలువురు సభ్యులు వ్యతిరేకించారు. ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తూ అభివృద్ధి చేయాలని తీర్మానించారు. అనంతరం శాఖల వారీగా జరిగిన చర్చల్లో పలువురు అధికారులు ప్రజాప్రతినిధులకు సమాధానాలు ఇచ్చారు. ప్రధానంగా తహశీల్దార్ శాంతి భూషణరావు మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధిం చిన సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ పనులకు సంబంధించి డీఈఈ ప్రసాద్ మాట్లాడుతూ జల్ జీవన్‌మిషన్ పనులను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఆశాజ్యోతి, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్, ఏవో రాము తదితర అధికారులతో పాటు ఆయా పంచాయతీల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

జీఎస్టీ సంస్కరణలతో కొనుగోలు శక్తి పెరుగుదల

▸▸ కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల ▸▸ వాణిజ్య పన్నుల శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్ల సందర్శన ▸▸ పేద, మధ్యతరగతి కోసమే 'సూపర్ సిక్స్'



వాణిజ్య పన్నుల విభాగం స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల, తదితరులు



జీఎస్టీపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో చేపట్టిన సంస్కరణలు దేశాభివృద్ధికి దోహదపడతాయని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. ఇక్కడి ఎస్ఆర్ శంకరన్ భవనంలో వాణిజ్య పన్నుల విభాగం అధికారులు సోమవారం ఏర్పాటు చేసిన వాణిజ్య ప్రచార అవగాహన ప్రదర్శనను సందర్శించి మాట్లాడారు. దేశాభివృద్ధి సాధించే విధంగా జీఎస్టీని 12 శాతం నుంచి ఐదు శాతానికి కేంద్రం తగ్గించిందని వివరించారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, వ్యాపారాలు రెట్టింపు అభివృద్ధి చెందేందుకు సూపర్ జీఎస్టీ దోహదపడతుందన్నారు. పేద, మధ్యతరగతిని దృష్టిలో పెట్టుకుని సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందని కొణతాల వెల్లడించారు. విద్యా, వ్యాపార రంగానికి సూపర్ గిఫ్ట్‌ను ఎన్డీయే ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు ద్వారా అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఆర్డీవో షేక్ ఆయిషా, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబుతో పాటు కూటమి నాయకులు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారులు సరకుల ధరలు తగ్గించకుంటే ఫిర్యాదు చేయండి : జడ్సీ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. రింగురోడ్డు, స్టేషన్‌రోడ్డు, వేల్పులవీధి, నాయుళ్లవీధి తదితర ప్రాంతాలతో పాటు యోగా కేంద్రం, విద్యా సంస్థల్లో విస్తృతంగా పర్యటించి జీఎస్టీలో కేంద్రం చేపట్టిన సంస్కరణల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలు వినియోగించే వస్తువులపై 18 శాతం ఉన్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం ఐదు శాతానికి తగ్గించిందని వివరించారు. ఎవరైనా వ్యాపారులు తగ్గిన జీఎస్టీ ధరలపై సరకులు అమ్మకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా వస్తువుల ధరల్లో తేడా ఉంటే జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏపీడీ వై.సంతోష్‌కుమార్, శానిటేషన్ సూపర్‌వైజర్ ఆర్.రవికుమార్, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల వైద్య ఖర్చులు తగ్గనున్నాయి'

జీఎస్టీలో సంస్కరణల కారణంగా మందుల ధరలు తగ్గాయని డీఐఓ డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్ అన్నారు. ఇక్కడి డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. వైద్య చికిత్సలు పొందేందుకు, నిత్యం ప్రజలు ఉపయోగించే మందులు, వైద్య పరికరాలు, అత్యవసర మందులు అందుబాటు ధరల్లో ఉండాలన్న ఉద్దేశ్యంలో 12 శాతం ఉన్న జీఎస్టీని ప్రభుత్వం ఐదు శాతానికి తగ్గించిందన్నారు. కొన్నింటిపై పూర్తిగా జీఎస్టీ తగ్గించడం వల్ల ప్రజల వైద్య ఖర్చులు తగ్గనున్నాయన్నారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్.రామకృష్ణ, మిన్నరాజు, శేషుకుమార్, జగదీష్, రమణ, ఎం. సుగుణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి మండలంలో భారీ వర్షం

తుమ్మపాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. మధ్యాహ్నం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై కుండపోతగా వాన పడడంతో లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. తుమ్మపాల మెయిన్‌రోడ్డు కిలోమీటరు మేర వర్షపు నీటితో చెరువును తలపించింది. వెంకుపాలెం, మార్టూరు, దిబ్బపాలెం జంక్షన్లలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. దీంతో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికితోడు రోడ్లపై ఎక్కడికక్కడ గోతులు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడ్డారు.





చెరువును తలపిస్తున్న తుమ్మపాల మెయిన్ రోడ్డు

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేత

కశింకోట, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఉన్నవారికి మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. తీడ, తాళ్లపాలెం, నర్సింగబిల్లి గ్రామాల్లో సోమవారం పర్యటించి పలువురు రోగులకు సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం జీఎస్టీలో సంస్కరణల వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి'



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిబ్బందికి సూచనలిస్తున్న తహశీల్దార్

కశింకోట, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపేందుకు కృషి చేయాలని తహశీల్దార్ సీహెచ్.తిరుమలరావు, ఎంపీడీవో చంద్రశేఖరరావు సూచించారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. తొలుత వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవీవో శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖాధికారిణి డాక్టర్ చైతన్యమణి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటన విజయవంతం చేయాలి : అదీప్‌రాజ్



వైసీపీ శ్రేణులతో సమావేశమవుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

లంకెలపాలెం, అక్టోబరు 6 : జిల్లాలో ఈ నెల తొమ్మిదో తేదీ గురువారం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టనున్న పర్యటనను వైసీపీ శ్రేణులు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపు నిచ్చారు. సోమవారం ఇక్కడ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. రోడ్డు మార్గంలో నర్సీపట్నం వెళ్లనున్న జగన్‌కు లంకెలపాలెం జంక్షన్‌లో స్వాగతం పలికేందుకు తరలి రావాలన్నారు. ఈ సమావేశంలో 85వ వార్డు అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ, నాయకులు అప్పికొండ మహాలక్ష్మినాయుడు, పచ్చికోరు రమణమూర్తి, సుందరపు అప్పారావు, గెంజి సురేశ్, బొద్దపు శ్రీనివాసరావు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీకి స్వచ్ఛ అవార్డు



సీఎం ద్వారా అవార్డు అందుకుంటున్న మేయర్ పీలా, జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా 'స్వచ్ఛ' అవార్డును మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ అందుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ పీలా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడుతూ నగర ప్రజలు, నివాసిత సంక్షేమ సంఘాలు, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికుల భాగస్వామ్యంతో ఈ అవార్డు దక్కిందన్నారు. సీఎం చంద్రబాబు ఆశయ సాధన దిశగా ప్రారంభమైన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రను ముందుకు తీసుకువెళతామని కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. స్వచ్ఛ మునిసిపాలిటీల కేటగిరీలో జీవీఎంసీ (స్వచ్ఛ సర్వేక్షణ్ స్పెషల్)కి రాష్ట్రస్థాయి అవార్డు లభించిన విషయం తెలిసిందే.

ఆలయ భూమికి రక్షణ కల్పించాలి

▸▸ తహశీల్దార్‌ను కోరిన గొటివాడ గ్రామ పెద్దలు

సబ్బవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొటివాడ గ్రామ దేవత మరిడిమాంబ ఆలయ భూమికి ఆక్రమణదారుల నుంచి రక్షణ కల్పించాలని పలువురు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, గ్రామ కమిటీ ప్రతినిధులు సీహెచ్.శ్రీనివాసరాజు, బి.సత్యారావు, ఎస్.సూరిబాబు, విరోతి చినఅప్పలనాయుడు తదితరులు మాట్లాడుతూ గొటివాడ సర్వే నెంబరు 275//1లో 30 సెంట్ల భూమిని పూర్వం అదే గ్రామానికి చెందిన చింతలపాటి సత్యనారాయణరాజు, అతని కుటుంబ సభ్యులు గ్రామ దేవత మరిడిమాంబకు విరాళంగా రాసి ఇచ్చారన్నారు. సదరు స్థలంలో అమ్మవారికి ఆలయం నిర్మించి దశాబ్దాల కాలంగా పండుగలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో సర్వేయర్‌గా పనిచేసిన వ్యక్తి రికార్డుల్లో పేర్లు తారుమారు చేయించారని ఆరోపించారు. అనంతర కాలంలో సదరు వ్యక్తి భార్య అమ్మవారి భూమి తమదని గ్రామంలో వివాదాలు సృష్టిస్తున్నారని వాపోయారు. తక్షణమే సమగ్ర సర్వే జరిపి అమ్మవారి ఆలయ భూమికి హద్దులు నిర్ణయించి, రక్షణ కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామ కమిటీ పెద్దలు కె.పరమేశ్వరరావు, జి.దుర్గాప్రసాద్, వి.రామారావు, ఇ.సింహాచలం, బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న గొటివాడ గ్రామ పెద్దలు

లంకెలపాలెం కూడలిలో రహదారి అధ్వానం

▸▸ పెద్ద పెద్ద గోతులతో వాహన చోదకులకు ఇబ్బందులు

▸▸ తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు వేడుకోలు



లంకెలపాలెం కూడలిలోని పరవాడ రహదారిపై పడిన గోతులు

లంకెలపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : లంకెలపాలెం కూడలిలో రహదారి అధ్వానంగా మారింది. ఈ కూడలి నుంచి పరవాడ, ఫార్మాసిటీ వెళ్లే మార్గంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఇటుగా ప్రయాణించే వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఫార్మాసిటీలోని వివిధ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు నిత్యం ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే పెదముషిడివాడ, పచ్చికోరువానిపాలెం, విజయరాంపురం, గండివానిపాలెం, నక్కవానిపాలెం, మార్కండేయనగర్, కన్నూరు, మంత్రిపాలెం, మడకపాలెం గ్రామాల ప్రజలు లంకెలపాలెం కూడలి మీదగా మండల కేంద్రం పరవాడకు రావాలన్నా ఈ రహదారినే ఆశ్రయిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రహదారిపై పెద్ద గోతులు పడడంతో రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గత నెల రోజులుగా ఇక్కడ ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ గోతుల్లో వర్షపు నీరు చేరుతుండడంతో పెద్దవిగా మారి ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురువుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి అస్తవ్యస్తంగా మారిన రహదారికి మరమ్మతులు చేపట్టాలని అంతా కోరుతున్నారు.



గోతుల్లో చేరిన వర్షపు నీరు

ఎస్ఈజెడ్ పైప్‌లైన్‌కు రంధ్రం

▸▸ రెండేళ్లుగా తాగు నీరు వృథా

▸▸ పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు

▸▸ మండిపడుతున్న స్థానికులు

పరవాడ, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని అచ్యుతాపురం ఎస్ఈజెడ్ (సెజ్)కు తాగు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు రావాడ పంచాయతీ బొట్టవానిపాలెం ప్రధాన రహదారికి ఆను కొని రంధ్రం ఏర్పడింది. దీంతో నీరు వృథాగా పోతోంది. ఏలేరు కాలువ నుంచి తాడి వద్ద గల ఏపీఐఐసీ పంప్‌హౌస్ ద్వారా సెజ్‌కు నీటి సరఫరా జరుగుతోంది. అయితే గత రెండేళ్ల క్రితం ఎలమంచిలి - గాజువాక ప్రధాన మార్గంలోని బొట్టవానిపాలేనికి చెందిన కారుకొండ కన్నయ్య ఇంటికి సమీపంలో భూమి అడుగు భాగాన పైప్‌లైన్‌కు రంధ్రం ఏర్పడటంతో పెద్ద ఎత్తున నీరు వృథా అవుతోంది. ప్రధాన రహదారి గుండా నీరు పారుతూ సమీపంలో గల వ్యవసాయ భూమిలోకి చేరుతోంది. ఏపీఐఐసీ అధికారుల నిర్లక్ష్యంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా నీరు వృథాగా పోతున్నా పట్టించుకోకుండా నిద్రమత్తులో ఉన్నారా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మేల్కొని తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయడంతో పాటు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని అంతా కోరుతున్నారు.



పైప్‌నకు రంధ్రంతో గుంత ఏర్పడిన దృశ్యం



రహదారి వెంబడి వృథాగా పారుతున్న నీరు



పరవాడ ప్రధాన రహదారిపై గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

వీధి కుక్కల వీరంగం

▸▸ పరవాడలో గుంపులుగా సంచారం

▸▸ వాహనదారులను వెంబడిస్తుండడంతో భయాందోళన

▸▸ ఈ కంగారులో తరచూ ప్రమాదాలు

పరవాడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో వీధి కుక్కలు భయపెడుతున్నాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ జనాన్ని హడలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో బయటకు రావాలంటేనే స్థానికులు హడలిపోతున్నారు. ద్విచక్ర వాహనాలను వెంబడిస్తుండడంతో వాహనాలు నడిపేవారు కంగారుగా పడి స్పీడుగా నడుతుండడంతో పలువు ప్రమాదాలకు గురవుతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు కనిపిస్తే వారిపై నిచ్చెనవేసి మరీ దాడిచేస్తున్నాయి. దీంతో పిల్లలను బయటకు పంపించాలంటేనే తల్లిదండ్రులు ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బొంకులదిబ్బ, రామాలయం, జగన్నాథ వీధులతో పాటు సంతబయలు వద్ద వీటి బెడద ఎక్కువగా ఉంది. వీధుల్లోకి రావాలంటేనే స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కుక్కల నిర్మూలనకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులంతా కోరుతున్నారు.

శారదా నది రక్షణ గట్టుపై తుప్పల తొలగింపు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి ఆను కొని ఉన్న శారదా నది రక్షణ గట్టు మెరుగుపడింది. మెయిన్ రోడ్డులోని శారదా గట్టు నుంచి ఉమ్మలాడ జం క్షన్‌కు వెళ్లే గట్టు అంతా తుప్పలు, పిచ్చిమొక్కలతో నిండి ఉండేది. ఈ మార్గంలో వాకింగ్ చేసే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ నేవారు. ఈ విషయాన్ని ఇటీవల ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి స్థానికులు తీసుకు వెళ్లారు. దీంతో గట్టు దారి పొడవునా పేరుకుపోయిన తుప్పలు, పిచ్చి మొక్కలను ఎక్సకవేటర్ సహాయంతో సోమవారం తొలగించేలా చర్యలు చేపట్టారు. వాకర్స్‌తో పాటు ఉమ్మలాడకు వెళ్లే వారు ఈ గట్టు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం గల శారదా నది రక్షణ గట్టుపై ఎమ్మెల్యే కొణతాలతో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకీ ప్రత్యేక దృష్టి సారించడంతో అంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆళ్ల రామచంద్రరావు, తాడి రామకృష్ణ, అప్పికొండ గణేశ్, భర్నికాన రాము తదితరులు పాల్గొన్నారు.

'హైవే బాధితులకు పరిహారం చెల్లించాలి'

గూడెంకొత్తవీధి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారి నిర్మాణంలో కాఫీ తోటలు, వ్యవసాయ భూములను కోల్పోయిన బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. సోమవారం పెదవలసలో బాధిత గిరిజనులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా బాధిత గిరిజనులు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో ఆదివాసీలు కాఫీ తోటలు, వ్యవసాయ భూములను కోల్పోవాల్సి వస్తుందన్నారు. పరిహారం చెల్లించిన తరువాతే నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. పరిహారం చెల్లించే వరకు ఆందోళన చేపడతామన్నారు.

మౌలిక వసతుల కల్పనకే గ్రామసభ : సర్పంచ్


గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నేతలు, అధికారులు

కొయ్యూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలోని గ్రామాలలో ప్రజాభీష్టం మేరకు మౌలిక వసతుల కల్పనకు గ్రామసభ నిర్వహిస్తున్నట్టు మూలపేట సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం మూలపేట పంచాయతీలో నిర్వహించిన ఆదికర్మయోగి గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో కొండసంత, రామాపురం, దారగెడ్డ గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అలాగే ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో పనులు గుర్తింపుపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, పెసా ఉపాధ్యక్షుడు రాజబాబు, సభ్యులు దాసు, సత్తిబాబు, చింతపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజేశ్వరి, తదిరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కమిషన్ మండల అధ్యక్షుడిగా రామకృష్ణ



జి.మాడుగుల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : హ్యూమన్ రైట్స్ కమిషన్ మండల అధ్యక్షుడిగా లకే రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు భారతీయ మానవహక్కుల కమిషన్ నుంచి సోమవారం ఉత్తర్వులు అందినట్టు రామకృష్ణ చెప్పారు. యాక్ట్ 1993 మానవహక్కుల పరిరక్షణ ఆర్డినెన్స్ 12 ప్రకారం ప్రజలకు సేవలు అందిస్తానన్నారు.

ప్రమాదకర మలుపుల్లో తుప్పలు తొలగింపు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి-జీకేవీధి ప్రధాన రహదారిలో ప్రమాదకర మలుపుల్లో పోలీసుల చొరవతో స్థానికులు జంగిల్ తొలగించారు. ఈమార్గంలో తరచూ మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈమేరకు స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ ఆదేశాలతో సబ్ ఇన్స్పెక్టర్ సురేశ్ స్థానికులతో కలిసి మలుపుల వద్ద జంగిల్ని తొలగించారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా శోభన్బాబు

చింతపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):గ్రామ సచివాలయం ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడుగా వంపూరు శోభన్బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షుడుగా లింగేటి మోహన్, కార్యదర్శిగా కిముడు నవమోహన్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా సౌనాయి లలిత, కోశాధికారిగా గూడేపు మనోహర్, సహాయ కోశాధికారిగా కినబరి పవన్కుమార్, స్టీరింగ్ కమిటీగా బిసాయి భాను ప్రకాశ్, కోడా రవీంద్రబాబు ఎన్నికయ్యారు.

ప్రజలు భక్తి భావం కలిగి ఉండాలి

▸▸ వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బేతాళుడు, పూర్ణచంద్రరావు

చింతపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):ప్రజలు సంతోషంగా జీవించాలంటే దైవభక్తి కలిగి ఉండాలని వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ అతిథి గృహంలో అసరాడ లహరికృష్ణ స్తుతి ధ్యాన కేంద్రం, ఆదివాసీ బ్రహ్మయజ్ఞ ధ్యాన భజన సంఘం భక్తి భజన పాటలు, నృత్యాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అమృతమంజరి అంకురం-2, తన ప్రేమగల చేతుల నైపుణ్యం పుస్తకాలను పెదిరెడ్ల బేతాళుడు, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం నాయకుడు తాటిపాకల వెంకట నాగేశ్వరరావు, గెమ్మెల మాజీ సర్పంచ్ గెమ్మెలి అప్పలనాయుడు, పీజీహెచ్ఎం జక్కు శంకర రావు, ఉపాధ్యాయుడు బి. నూకరాజు, కమిటీ పెద్దలు వానది మత్స్యలింగం, గెమ్మెలి సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

▸▸ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి


క్రీడా పోటీల సభలో మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి

పాడేరురూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి కోరారు. సోమవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. జాతీయ స్థాయి క్రీడల్లో ముందంజలో ఉంటే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి సూరిబాబు మాట్లాడుతూ బాలికల వాలీబాల్ అండర్-17 విభాగంలో గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికలు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, కృష్ణవేణి, భవాని, సూర్యకుమారి పాల్గొన్నారు.

అనంతగిరి భారీ వర్షం

అనంతగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. రోడ్లపై నుంచి వరదనీరు పోటెత్తి పారింది. రోడ్లపై నీరు నిలిచిపోవడం వాహనదారులు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ద్విచక్ర వాహన చోదకులు ఎక్కడికక్కడ తమ వాహనాలను ఆపి నిలిచిపోయారు. ఈ వర్షంతో రెండు గంటల పాటు జనజీవనం స్తంభించింది.

కనీస అభ్యసనా సామర్థ్యాలపై దృష్టి

డుంబ్రిగుడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కనీస అభ్యసనా సామర్థ్యాలు సాధించడంపై ప్రత్యేక దృష్టిసారించామని మండల విద్యా శాఖాధికారి సుంద్రరావు చెప్పారు. జిల్లా కలెక్టర్ దినేష్కుమార్ ఆదేశాల మేరకు సమగ్ర శిక్ష నిర్వహించనున్న (తర్ల్) ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి కనీస సామర్థ్యాలు నేర్పించుటకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాఫీ తోటల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

▸▸ అధికారులకు ఐటీడీఏ పీవో శ్రీపూజ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో శ్రీపూజ

పాడేరురూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలో లక్ష ఎకరాల్లో కాఫీ తోటలను, 75 వేల ఎకరాల్లోని పాత తోటల పురుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కాఫీ బోర్డు లైజన్ వర్కర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాఫీ విత్తనం సేకరణ, టెండర్ల ద్వారా పాలిథిన్ సంచులు ఏర్పాట్లు చేస్తున్నామని, 38 ప్రైమరీ నర్సరీ కేంద్రాలను గుర్తించామన్నారు. 2026-27 నాటికి పదివేల ఎకరాలలో కొత్త కాఫీ తోటలు, 15 వేల ఎకరాల్లో పాత కాఫీ తోటలలో పునరుద్ధరణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెల నుంచి చేతికి వచ్చే కాఫీ పంటను చింతపల్లి మ్యాక్స్ సొసైటీ ద్వారా సేకరించేందుకు లైసెన్స్ వర్కర్ల సహకరించాలన్నారు. బెర్రీబోర్ చీడపురుగు నిర్మూలనకు కష్టపడి పనిచేసినందుకు లైజన్ వర్కర్లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వర్లు, కాఫీ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.బొంజుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి పాడేరు పీటీడీ డిపో సమస్యలు

▸▸ గిరిజనులకే షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలు దక్కేలా ప్రణాళిక


కలెక్టర్కు వినతిపత్రం అందిస్తున్న రీజనల్ చైర్మన్ దొన్నుదొర తదితరులు

పాడేరురూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పాడేరు పీటీడీ డిపో సమస్యలను జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్కుమార్ దృష్టికి ఆర్టీసీ విజయనగరం రీజనల్ చైర్మన్ ఎస్.దొన్నుదొర సోమవారం తీసుకువెళ్లారు. సోమవారం పాడేరు వచ్చిన ఆయన తొలుత డిపోలో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. డిపో సమస్యలను అడిగి తెలుసున్నారు. అనంతరం ఆయన కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి సమస్యలపై దొన్నుదొర చర్చించారు. డిపో పరిసర స్థలాలు కబ్జాకు గురికాకుండా గిరిజన యువతీ, యువకులకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు కలెక్టర్కు వివరించారు. టెండర్ రూపంలో గిరిజనులకే షాపింగ్ కాంప్లెక్స్లోని దుకాణాలు దక్కేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. భద్రాచలం సర్వీస్ ఆదాయం తక్కువ వస్తున్న విషయాన్ని, బస్ స్టేషన్ల పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. కలెక్టర్ దినేశ్కుమార్ మాట్లాడుతూ ఈ విషయాలపై పక్కా ప్రణాళికతో బ్లూప్రింట్ తయారు చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పి.శ్రీనివాసరావు, గ్యారేజ్ కోచ్బిల్డర్ కేవీఎస్ఎన్.రాజు,డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేంద్రీయ పద్ధతిలో పంటల సాగు లాభదాయకం

▸▸ ఎన్ఎస్ఎస్పీ మాస్టర్ ట్రైనర్ శ్యామ్ సుందర్రెడ్డి

గూడెంకొత్తవీధి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):సేంద్రీయ పద్ధతిలో పంటలను సాగు చేసుకుంటే గిరిజన రైతులకు లాభదాయకమని జాతీయ సుస్థిర సుగంధ ద్రవ్యాలు(ఎన్ఎస్ఎస్పీ) మాస్టర్ ట్రైనర్ బి. శ్యామ్సుందర్ రెడ్డి అన్నారు. సోమవారం దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెంలో మాతోట రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్య పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు పొందడంతో పాటు మార్కెట్లో అధిక ధర పొందవచ్చునన్నారు. మాతోట కాఫీ మేనేజర్ కంకిపాటి గాంధీ మాట్లాడుతూ ఎఫ్పీవో కాఫీ గింజలకు అంతర్జాతీయ ధరలు అందించడం జరుగుతుందన్నారు. కాఫీలో వ్యాప్తి చెందిన కాఫీ బెర్రీ బోరర్పై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో సీఈవో చిన్నారావు పాల్గొన్నారు.

తాజంగి, రింతాడ పంచాయతీలకు స్వచ్ఛాంధ్ర అవార్డులు

చింతపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి పంచాయతీకి స్వచ్ఛాంధ్ర అవార్డు లభించింది. సోమవారం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్కుమార్, ఐటీడీఏ పీవో శ్రీపూజ, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్కుమార్ ఈ అవార్డుని ఎంపీపీ కోరాబు అనుషదేవి, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, సర్పంచ్ మహేశ్వరి, కార్యదర్శి శ్రీధర్లకు అందజేశారు. పరిశుభ్రతలో తాజంగికి స్వచ్ఛాంధ్ర అవార్డు లభించడం సంతోషంగా ఉందని ఎంపీపీ అన్నారు.


స్వచ్ఛాంధ్ర అవార్డును అందుకుంటున్న ఎంపీపీ కుమారి, కార్యదర్శి అరుణ్కుమార్

గూడెంకొత్తవీధిలో..

మండలంలోని రింతాడ గ్రామ పంచాయతీకి స్వచ్ఛాంధ్ర-2025 అవార్డు లభించింది. పారిశుధ్యం మెరుగులో రింతాడ పంచాయతీ అగ్రస్థానంలో నిలిచిది. ఈమేరకు జిల్లా స్థాయిలో రింతాడ పంచాయతీకి స్వచ్ఛాంధ్ర అవార్డుని సోమవారం జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, కార్యదర్శి అరుణ్ కుమార్ అందుకున్నారు.


స్వచ్ఛాంధ్ర అవార్డుని కలెక్టర్ చేతుల మీదుగా అందుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉపాధ్యాయులకు టీఏఆర్ఎల్పై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్

చింతపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు సరైన స్థాయిలో బోధించడం(టీఏఆర్ఎల్)పై శిక్షణ ఇస్తున్నామని స్థానిక మండల విద్యాశాఖ అధికారి, కోర్సు డైరెక్టర్ వీబీవీవీ ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు తొలివిడత టీఏఆర్ఎల్ శిక్షణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మూడోవ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు టీఏఆర్ఎల్ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు, పరిశీలకుడు గోవిందరావు, రిసోర్సుపర్సన్లు కుడుముల వెంకట రావు, మునిస్వామి, బి.సంజీవరావు, కె. సంజీవరావు, కె. మహేశ్, దిబ్బ నాయుడు, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొయ్యూరులో..

విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన కోసం ప్రభుత్వం టీచింగ్, రైటింగ్ లెవిల్స్పై ఉపాధ్యాయులకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసిందని సహాయ గిరిజన సంక్షేమ శాఖాధికారి (ఏటీడబ్ల్యూవో) క్రాంతికుమార్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు టీచింగ్, రైటింగ్ లెవిల్స్పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడంలో మెలకవులను నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాంబాబు, రిసోర్స్పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.మాడుగులలో..

విద్యాబోధనకు తరాల శిక్షణ తరగతులు దోహదపడతాయని ఎంఈవో బాబూరావుపడాల్ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ శిక్షణ తరగతులను రెండు విడుతలుగా నిర్వహిస్తామన్నారు. తొలి దశలో 175 మందికి, రెండో దశలో 176 మంది ఉపాధ్యాయులకు విద్యాబోధనపై మెలకవులు, సూచనలు అందిస్తామన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తహశీల్దార్ రాజ్కుమార్, ఎంపీడీవో డేవిడ్రాజు, ఏటీడబ్ల్యూవో నాగజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

▸▸ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు


కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నేత నరసింగరావు

అరకులోయ, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసిగరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీఐటీయూ ఆధ్వర్యంలోని జిల్లా కమిటీ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల గోడును పట్టించుకోవడం లేదని, కనీస వేతనలు అమలు చేయకపోవడం కార్మికులు పస్తులంటూ కాలం వెళ్లదీస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ పేరుతో కార్మికులను జీవితాలతో అడుకోవద్దని, ఉద్యోగాన్ని నమ్ముకుని కుటుంబాలను నెట్టుకువస్తున్న కార్మికులు రోడ్డునపడేస్తే ఊరుకోమని హెచ్చరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులపై ఉన్న శ్రద్ధ కార్మికులపై చూపి, కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి మేలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అల్లూరి, అనకాపల్లి జిల్లాల ప్రతినిధులు వి.ఉమామహేశ్వరరావు, ఆర్.శంకరరావు, పోతురాజు, మోసియ, భగత్రామ్, భాగ్యలక్ష్మి, నాగమ్మ, సుందరరావు, జనబంధు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్లో ఉత్తమ ఫలితాలకు కృషిచేయండి

▸▸ జిల్లా విద్యా శాఖ అధికారి బ్రహ్మాజీరావు


ముంచంగిపుట్టు: శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

ముంచంగిపుట్టు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి(డీఈవో) పి.బ్రహ్మాజీరావు ఆదేశించారు. మండల కేంద్రంలో సోమవారం ఉపాధ్యాయులకు ప్రారంభమైన టీచింగ్ ఎట్ రీడింగ్ లెవల్ శిక్షణ తరగతులను డీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదోవ తరగతి ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదని, వచ్చే ఏడాది మంచి ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తరగతి గదిలో అమలు చేసి పిల్లల్లో ఆశించిన విద్యా ప్రయాణాలను వెలికితీయాలన్నారు. ఈ ఏడాది పది ఫలితాలు కేవలం 47 శాతం మాత్రమే వచ్చాయని, వచ్చే ఏడాది మార్చిలో మెరుగైన ఫలితాలు వచ్చే విధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని చెప్పారు. పలు సర్వేలలో విద్యార్థులకు కనీస సామర్థ్యం లేనట్టుగా తేలడంతో జిల్లా కలెక్టర్ దినేష్కుమార్ ప్రత్యేక చొరవతో ఈ ఏడాదిలో రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బాగా వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి, విద్యా సామర్థ్యాలను మెరుగు పరిచేలా తర్ఫీదు ఇవ్వాల్సలన్నారు. అలాగే శిక్షణ తరగతులకు హాజరు కాని 11 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంఈవో క్రిష్ణమూర్తికి సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవో త్రినాథ్, రిసోర్స్పర్సన్ హరిబాబు, క్లస్టర్ రిసోర్స్ మోనటరింగ్ టీచర్లు అనిల్, గౌరిశంకర్, సూర్యనారాయణ, సురేష్, ఈశ్వర్, భాస్కర్ పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో బ్రహ్మాజీరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనబడిన విద్యార్థులను గ్రేడ్లుగా విభజించి, వారికి ప్రత్యేకంగా బోధన చేయాలన్నారు. తద్వారా వారిలో సామర్థ్యాలు పెంచాలని చెప్పారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు ప్రత్యేత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉప విద్యా శాఖ అధికారి ఎస్.చెలయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కనీస అభ్యసనా సామర్థ్యాలను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. గత ఏడాది కంటే ఈసారి ఫలితాలు ఉత్తమంగా రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఈసీ కార్యదర్శి సువర్ణ రాజు, ఎంఈవో విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రద్దీగా పీటీడీ బస్ కాంప్లెక్స్

▸▸ సెలవులు ముగియడంతో తిరిగి వెళుతున్న విద్యార్థులు


కాంప్లెక్స్లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

పాడేరురూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తిరుగు ప్రయాణంతో పీటీడీ బస్ స్టేషన్ సోమవారం కిటకిటలాడింది. కళాశాలల విద్యార్థులకు గత నెల 28వ తేదీ నుంచి ఈనెల ఐదో తేదీ వరకు దసరా సెలవులు ఇచ్చారు. కళాశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభంతో సోమవారం ఉదయం విద్యార్థులు బయలుదేరారు. దీంతో పాడేరు పీటీడీ కాంప్లెక్స్, ప్రైవేటు జీపు, ఆటో స్టాండ్లు రద్దీగా మారాయి. బస్సులు సకాలంలో లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు కాంప్లెక్స్లో గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. అలాగే చింతపల్లి, జి.మాడుగుల, అరకు ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలలు శుక్రవారం పునఃప్రారంభమైనప్పటికీ విద్యార్థులను తల్లిదండ్రులు సోమవారం తీసుకురావడంతో వాహనాలు రద్దీగా మారాయి.

ప్రజా భాగస్వామ్యంతో వంజంగిలో టూరిజం అభివృద్ధి

▸▸ ఫారెస్టు రేంజర్ ఎ. ప్రేమ

పాడేరురూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వంజంగి మేఘాల పర్వతం అభివృద్ధి చేయనున్నట్టు స్థానిక ఫారెస్టు రేంజర్ ఎ.ప్రేమ తెలిపారు. ఎకో టూరిజం, వీఎస్ఎస్, పరిసర గ్రామాల ప్రజల సహకారంతో మేఘాల పర్వతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. పరిసర గ్రామాల ప్రజలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మెరుగుపడటంతో పాటు పర్యాటక వసతులు మెరుగుపడతాయన్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వంజంగి, దొడ్డిపల్లి, ఎగువ సంపాలు, కొత్తవలస, పోతురాజుమెట్ట గ్రామాల ప్రజలు తమ అభ్యంతరాలను ఈనెల 8వ తేదీలోగా ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి అందజేయాలన్నారు. వాటిపై సాధ్యాసాధ్యాలను చర్చించేందుకు ఈనెల 10వ తేదీన ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు.

జలగలగెడ్డ రహదారికి సర్వే


రహదారి నిర్మాణానికి సర్వే చేస్తున్న టీడబ్ల్యూ ఇంజనీరింగ్ అధికారులు

చింతపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని లంబసింగి పంచాయతీ జలగలగెడ్డ గ్రామానికి రోడ్డు కోసం గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సోమవారం సర్వే చేశారు. రహదారి సదుపాయం లేకపోవడంతో పక్కా గృహాల నిర్మాణానికి సామగ్రిని తరలించలేకపోతున్నామని గ్రామస్థులు మీకోసంలో జిల్లా కలెక్టర్కి వినతిపత్రం అందజేశారు. ఈమేరకు తహశీల్దార్ జి. ఆనందరావు ఆదేశాలతో సోమవారం రహదారి నిర్మాణానికి గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు సర్వే నిర్వహించారు. అయితే లంబసింగి జంక్షన్ గిరిజనులు రహదారి నిర్మాణానికి అభ్యంతరం తెలిపారు. తమ గ్రామ రహదారికి సహకరించాలని జలగలగెడ్డ గిరిజనులు విజ్ఞప్తి చేశారు. కాగా రహదారి నిర్మాణానికి లంబసింగి జంక్షన్ ప్రజలు అభ్యంతరాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకువెళతామని వర్కు ఇన్స్పెక్టర్ శ్రీనివాసు తెలిపారు.

భూ సమస్య పరిష్కారానికి ఒప్పందం

▸▸ చోడిరాయి, తోకరాయి గ్రామస్థుల మధ్య అవగాహన


సీలేరు ఎస్ఐకి వినతిపత్రం ఇస్తున్న తోకరాయి, చోడిరాయి గ్రామస్థులు

సీలేరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం చోడిరాయి, తోకరాయి గ్రామాల మధ్య నెలకొన్న భూసమస్య పరిష్కారమైంది. రెండు గ్రామాల గిరిజన పెద్దల మధ్య జరిగిన అంగీకారం మేరకు ఒప్పంద పత్రాన్ని సీలేరు ఎస్ఐ రవీంద్రకు సోమవారం అందజేశారు. ఇటీవల తోకరాయికి చెందిన కొందరు గ్రామస్థులు తమ గ్రామం శివారుకు వచ్చి భూమిని సాగుచేయడానికి వీలులేదంటూ హెచ్చరించారు. ఆదివారం ఆ భూమిలో ఉన్న కొన్ని జీడిమామిడి, జాఫ్రా చెట్లను నరికివేశారు. దీనిపై సీలేరు ఎస్ఐ రవీంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాల గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు చర్చించుకోవాలని సూచించారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు సమావేశం ఏర్పాటు చేసుకొని ఒక ఒప్పందానికి వచ్చారు. తోకరాయి సరిహద్దుకు ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతంలో చోడిరాయి గ్రామస్థులు సాగుచేసుకుంటున్న భూములకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్నవారు యథావిధిగా సాగు చేసుకోవచ్చునని, పట్టాలు లేనివారు అటవీ శాఖ అధికారులు లిఖిత పూర్వకంగా ఆదేశాలు వచ్చేవరకూ ఆ భూములు జోలికి వెళ్లరాదని నిర్ణయించుకున్నారు. అలాగే ఆ భూమిలో ఉన్న చెట్లను తోకరాయి గ్రామస్థులు నరకరాదని ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం గుమ్మిరేవుల సర్పంచ్ ముర్ల కమలమ్మ, ధారకొండ సర్పంచ్ నడిగోట్ల రాజు సమక్షంలో ఇరుగ్రామాల పెద్దలు తాము ఎటువంటి గొడవలు పడమని ఒప్పంద పత్రాన్ని రాసి సీలేరు ఎస్ఐ రవీంద్రకు ఇచ్చారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ రెండు గ్రామాల గిరిజనులు కలసిమెలసి ఉండాలని, సమస్యలు ఉంటే కూర్చొని చర్చించుకుంటే ఏ సమస్యలు రావన్నారు.

నీటి ట్యాంకు మరమ్మతు చేయాలని నిరసన

ముంచంగిపుట్టు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో నీటి ట్యాంక్ మరమ్మతు చేపట్టాలని గిరిజనులు సోమవారం నిరసన తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని నినాదాలు చేశారు. వార్డు సభ్యులు మిన్నారావు, బొంజుబాబు, గ్రామ నాయకులు జలంధర్, సాధురాం మాట్లాడుతూ బూసిపుట్టులో రూ.10 లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్ను నిర్మించారని, ప్రారంభం కాకముందే అది మూలకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన నీటి పథకం ప్రజల గొంతు తడపడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి తక్షణమే ఈ నీటి ట్యాంకును మరమ్మలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


బూసిపుట్టులో నీటి ట్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు


కుళాయిల్లో బురద నీరు వస్తుందని సీసాతో నీటిని చూపుతున్న మహిళలు

అర్జీలకు సత్వర పరిష్కారం చూపండి

▸▸ పీజీఆర్ఎస్‌లో అధికారులకు ఆర్డీవో వీవీ రమణ ఆదేశం

నర్సీపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని ఆర్డీవో వీవీ రమణ ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మునిసిపాలిటీలోని పబ్లిక్ కుళాయిల నుంచి బురద నీరు వస్తున్నదని ఏడో వార్డు పరిధిలోని కొత్తవీధికి చెందిన పలువురు మహిళలు ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. సీసాలో బురద నీరు తీసుకువచ్చి చూపించారు. వార్డులో చెత్తాచెదారం పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సమస్యను సత్వరమే సమస్య పరిష్కరించాలని మునిసిపల్ మేనేజర్ నాగరాజుకు ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు. అలాగే వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 14 అర్జీలు వచ్చినట్టు కార్యాలయం సిబ్బంది చెప్పారు. అధికంగా భూ సమస్యలు, వివాదాలపై ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు.

మాజీ సీఎం జగన్ సమావేశ ప్రదేశం పరిశీలన


మెడికల్ కాలేజీ వద్ద ప్రదేశాన్ని పరిశీలిస్తున్న వైసీపీ నాయకులు

మాకవరపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ ఈ నెల 9న మెడికల్ కాలేజీ పర్యటనలో భాగంగా సమావేశం నిర్వహించనున్న ప్రదేశాన్ని వైసీపీ ముఖ్య నాయకులు, అధికారులు సోమవారం పరిశీలించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్‌తో పాటు డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అమర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ భీమబోయినపాలెం గ్రామంలోని మెడికల్ కాలేజీ పనులను పరిశీలిస్తారన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కాగా, స్థల ప్రదేశ పరిశీలనలో నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ, ఎస్‌ఐ దామోదర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సభ్య రైతులకు అండగా ఉంటాం..

▸▸ కొత్తకోట సంఘ పర్సన్ ఇన్‌చార్జి రాజు


సభ్య రైతుల కుటుంబాలకు బీమా చెక్కులు అందిస్తున్న రాజు

రావికమతం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్య రైతులకు అన్ని వేళలా అండగా ఉంటామని సంఘ పర్సన్ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు చెప్పారు. సంఘం పరిధిలో ఇటీవల మృతి చెందిన సభ్య రైతులు గోలగాన అప్పలనాయుడు, సోమిరెడ్డి రాజు, గోకాడ దేవుడులకు సంబంధించి నామినీలకు మంజూరైన బీమా చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ద్వారా సభ్య రైతులకు రుణాలతో పాటు మృతి చెందిన రైతుల వారసులకు బీమా అందేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రతి ఏటా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన సభ్య రైతులు సహజంగా మృతి చెందితే, వారి కుటుంబాలకు సంఘం ద్వారా ఉచితంగా రూ.5 వేలుతో పాటు 60 ఏళ్ల లోపు వారికి రూ.30 వేలు, పైబడిన వారికి రూ.15 వేలు బీమా అందిస్తున్నట్టు చెప్పారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు అదనంగా బీమా వర్తిస్తుందన్నారు. బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ దాసరి చిన్నబ్బాయి, సీఈవో గుర్రాల రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవ ప్రోత్సాహకాలు అందించరూ..

▸▸ జిల్లా కలెక్టర్‌కు సర్పంచుల వినతి


వినతిపత్రం చూపుతున్న ఏకగ్రీవ సర్పంచులు

చీడికాడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు పంచాయతీలు ఏకగ్రీవమై నాలుగున్నర సంవత్సరాలు పూర్తయినా ఏకగ్రీవ ప్రోత్సాహక నిధులు రాలేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జేబీ.పురం, ఎ.అగ్రహారం, శిరిజాం, దండిసురవరం, పెదగోగాడ పంచాయతీల సర్పంచులు గొల్లవిల్లి చిన్నమ్మలు, కన్నూరు సత్యవతి, సలాది ధనలక్ష్మి, కోన అర్జునతో పాటు వార్డు సభ్యులు గొల్లవిల్లి రాజబాబు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి లిఖితపూర్వకంగా సమస్యను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా పంచాయతీల్లో ఎటువంటి గొడవలు లేకుండా ఏకగ్రీవంగా పాలకవర్గాలను ఎన్నుకుంటే రూ.5 నుంచి రూ.7 లక్షల వరకు అభివృద్ధి కోసం నిధులు ప్రత్యేకంగా కేటాయిస్తామని చెప్పిన అధికారులు నేటికీ ఇవ్వలేదన్నారు. మరో ఆరు నెలల్లోగా ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున వెంటనే నిధులు మంజూరు చేయాలని వారు కోరారు.

చీడికాడలో భారీ వర్షం


చీడికాడలో కురుస్తున్న వర్షం

చీడికాడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నుంచి రాత్రి వరకూ వాన పడింది. తుఫాన్ ప్రభావంతో ఆది, సోమవారాలు వర్షం కురవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు... (ఇన్‌సెట్‌లో) చిన్నారితో అన్నప్రాసన చేయిస్తున్న ఎమ్మెల్యే

కె.కోటపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోషణ మాసోత్సవాల్లో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు పరిశుభ్రతతో కూడిన పోషకాహారం ఇవ్వాలని చెప్పారు. అలాగే వారికి క్రమశిక్షణ నేర్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదేనని స్పష్టం చేశారు. బాలలను పెంచే తల్లులుగా మంచిపేరు సంపాదించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే బాల్య వివాహాలను నిరోధించాల్సిన బాధ్యత కూడా అంగన్‌వాడీ కార్యకర్తలదేనన్నారు. తల్లులు, పిల్లలకు రక్తహీనత, పోషకాహార నివారణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలన్నింటిని లబ్ధిదారులు బాగా ఉపయోగించుకోవాలన్నారు. మిషన్ వాత్సల్య పథకంలో అనాథలైన పిల్లలకు స్కాలర్‌షిప్ అందించాలని సూచించారు. ఐసీడీఎస్ పీవో లలితకుమారి మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వరకు ప్రతీ గ్రామంలో పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, సర్పంచ్ యర్రంశెట్టి భవానీ, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి రాయపరెడ్డి కృష్ణ, నాయకులు డోకల నరసింహమూర్తి, జూరెడ్డి రాము, బత్తి వెంకటరమణ, పూడి నారాయణమూర్తి, కన్నూరు సూర్యనారాయణ, వెలగల పైడిమనాయుడు, పైలా అమ్మాజీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణాల్లో తిప్పలు

కిక్కిరిసిపోయిన ఆర్టీసీ కాంప్లెక్స్

వేళకు రాని బస్సులతో జనం పాట్లు



ప్రయాణికులు, విద్యార్థులకు కిక్కిరిసిపోయిన కాంప్లెక్స్... బస్సులో సీట్లు లేక బయట ఉండిపోయిన విద్యార్థినులు

చోడవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల అనంతరం సొంత గ్రామాల నుంచి కాలేజీలు, హాస్టళ్లకు వెళ్లే విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. జనం తండోపతండాలు రావడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ కిక్కిరిసిపోయింది. దీనికితోడు సమయానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో వారంతా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విద్యాలయాలకు ఆదివారంతో సెలవులు ముగిసిపోవడంతో చాలా మంది అటు అల్లూరి జిల్లా నుంచి, ఇటు మైదాన ప్రాంతాల నుంచి విశాఖ తదితర ప్రాంతాలకు ఒకేసారి బయలుదేరడంతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఇదే సమయంలో రహదారి బాగులేక మధ్యలో ట్రాఫిక్ అంతరాయాలతో ఆర్టీసీ బస్సులు సకాలంలో కాంప్లెక్స్‌కు రాకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో కాంప్లెక్స్ రద్దీగా మారిపోయింది. అలాగే వచ్చిన బస్సు వచ్చినట్టే నిండిపోయాయి. ఈ క్రమంలో సీట్లు దొరకక పిల్లలు, మహిళలు వృద్ధులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉండిపోవాల్సి దుస్థితి దాపురించింది. రద్దీ సమయంలో మరికొన్ని సర్వీసులు అదనంగా నడిపితే ఈ సమస్య పరిష్కారమవుతుందని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

అంధకారంలో నీళ్లబంద

మూడు నెలలుగా విద్యుత్ సౌకర్యం లేక గిరిజనుల అవస్థలు

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో నిలిచిపోయినన విద్యుత్ సరఫరా

ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని అధికారులు, పాలకులు


కాగడాలతో నిరసన తెలుపుతున్న నీళ్లబంద గిరిజనులు

రోలుగుంట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ల పంచాయతీ శివారు నీళ్లబంద గ్రామం అంధకారంలో మగ్గుతోంది. మూడు నెలలుగా విద్యుత్ సౌకర్యం లేక గిరిజనులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం జన్మన్ పథకంలో భాగంగా ఈ గ్రామానికి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామానికి విద్యుత్ వెలుగులు వచ్చాయని సంబరాలు చేసుకున్నారు. ఈ ఆనందం ఎంతో కాలం నిలువలేదు. అది నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మన్ పాడైపోయి కాలిపోయింది. అప్పటి నుంచి ఈ గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో గిరిజనులు రాత్ర వేళలో చికట్లోనే ఉండాల్సిన దుస్థితి దాపురించింది. అధికారులు, పాలకులకు సమస్య తెలిపినా ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి గిరిజనులు కాగడాలను ప్రదర్శించి వినూత్నంగా నిరసన తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ట్రాన్స్‌ఫార్మర్ వచ్చిన వెంటనే బిగిస్తామని చెబుతున్నారని, మూడు నెలలుగా దిమిటీల వెలుగులో గడపాల్సిన పరిస్థితి నెలకొందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఇన్‌చార్జి అధికారుల పాలనలో చీడికాడ..!

ప్రధాన శాఖలకు అధికారుల కొరత

కొత్తవారిని నియమించని ఉన్నతాధికారులు

ఇన్‌చార్జులతో కాలం నెట్టుకొస్తున్న వైనం

గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి


మండల పరిషత్ కార్యాలయం

చీడికాడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని అధికారుల కొరత పీడిస్తోంది. ప్రధాన శాఖలకు చెందిన ముఖ్య అధికారుల పోస్టులు ఖాళీగా ఉండడం.. ఉన్నవారు శిక్షణకు వెళ్లిపోవడం.. కొత్తగా పోస్టులను భర్తీ చేయకపోవడం.. వెరసి ఇన్‌చార్జులతో పాలన సాగుతోంది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది.

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న చీడికాడ మండలాన్ని జిల్లా అధికారులు చిన్నచూపు చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే అధికారుల పోస్టుల ఖాళీలను పూరించడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవోగా పనిచేస్తున్న హేమసుందర్రావు శిక్షణకు వెళ్లగా, ఆయన స్థానంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొనసాగుతున్నారు. సెప్టెంబరు 10న ఇక్కడ డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన చంద్రశేఖరరావుకు ఎంపీడీవోగా పదోన్నతి రావడంతో, ఆయన వేరొక మండలానికి వెళ్లిపోయారు. ఆయన స్థానంలో జి.కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపిని ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. ఇరిగేషన్ ఏఈగా పనిచేసిన జయరాం బదిలీపై వెళ్లడంతో, గత ఆరు నెలలుగా ఇన్‌చార్జి ఏఈగా బి.వి.సత్యనారాయణదొర పనిచేస్తున్నారు. అలాగే పంచాయతీరాజ్ ఏఈగా పనిచేసిన శరగడం పరదేశినాయుడు ఈ ఏడాది జనవరి 31న పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో మాడుగుల పీఆర్ ఏఈని ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. చీడికాడ హైస్కూల్ హెచ్‌ఎం కె.బొంజుబాబు ఎంఈవోగా ఇన్‌చార్జి విధులు నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్‌గా చేరిన రామయ్యనాయుడును రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావుకు పీఏగా జిల్లా అధికారులు డిప్యుటేషన్‌పై పంపించారు. ఇలా మండలంలో ఉన్న అన్ని ప్రధాన శాఖల అధికారులు డిప్యుటేషన్‌పై పనిచేయడంతో గ్రామాభివృద్ధి కుంటుపడుతుందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా డిప్యూటీ ఎంపీడీవో లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడి పారిశుధ్యం లోపిస్తున్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అన్ని శాఖలకు పూర్తి స్థాయి అధికారులను నియమించాలని కోరుతున్నారు.

మెడికల్ కళాశాలల ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తాం: మాజీ మంత్రి అమర్

నర్సీపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం కాకుండా ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళతామని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. సోమవారం పెదబొడ్డేపల్లి క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నాయకులు, కార్యర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాకవరపాలెంలో మెడికల్ కళాశాల భవనాలు సందర్శించడానికి ఈ నెల 9వ తేదీన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని తెలిపారు. విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గం మీదుగా మాకవరపాలెం చేరుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేత

కశింకోట, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఉన్నవారికి మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం సహాయ నిధి ఎంత గానో ఉపయోగపడుతుందని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. తీడ, తాళ్లపాలెం, నర్సింగబిల్లి గ్రామాల్లో సోమవారం పర్యటించి పలువురు రోగులకు సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం జీఎస్టీలో సంస్కరణల వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


ఎర్రవరంలో ర్యాలీ చేస్తున్న అటవీ శాఖ అధికారులు, ప్రజలు

గొలుగొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నర్సీపట్నం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఆర్.రామానుజులు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వన్య ప్రాణుల సంరక్షణ కోసం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎర్రవరం, కొత్తఎల్లవరం, రాజులబాబు గుడివద్ద ఈ ర్యాలీలు జరిగాయి. ఎర్రవరంలో ర్యాలీ అనంతరం రామనుజులు మాట్లాడుతూ ఆరిలోవ అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను సంరక్షించాలని కోరారు. వన్యప్రాణులు ఎవరైనా పట్టుకున్నా, చంపినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు గార్డు ఇందిర, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

దేవరాపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుకు ఉన్న భూములో వేసిన పంటలు నమోదు చేయడం తప్పనిసరని వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ చెప్పారు. మండలంలోని మారేపల్లి గ్రామంలో సోమవారం పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి ఉండి పంట వేసిన ప్రతీ రైతు నమోదు చేసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేక పంటలు నష్టపోతే పంట నమోదు ఉపయోగపడుతుందన్నారు. ప్రధానంగా ధాన్యం కొనుగోలుకు పంట నమోదు ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు.

కించుమండకు రోడ్డు నిర్మించాలి

దేవరాపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్భింగి శివారు కించుమండకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరారు. ఈ మేరకు అనకాపల్లి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఇళ్లు మంజూరు చేసి తాగునీటి సదుపాయం కల్పించారని, రోడ్డును మాత్ర మరిచిపోయారని గిరిజనులు చెప్పారు. ఈ విషయంలో అధికారులు, పాలకులు తక్షణమే స్పందించాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బీటీ దొర తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల ప్రారంభం రేపు

మాకవరపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ విద్యాలయం-2ను ఈ నెల 8వ తేదీన ప్రారంభిస్తున్నట్టు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు తెలిపారు. ఇప్పటికే ఈ పాఠశాలలో సుమారు 40 మందికిపైగా విద్యార్థులు చేరినట్టు చెప్పారు. ఈ ఏడాది విద్యార్థినులకు అందుబాటులో ఈ పాఠశాల ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పాఠశాలకు సామాగ్రి అందించడంతో పాటు సిబ్బందిని కూడా ప్రభుత్వం నియమించిందని ఆయన చెప్పారు.

నేడు నల్లగొండమ్మతల్లి జాతర



నాతవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిడిగొండ గ్రామంలో మంగళవారం నల్లగొండమ్మతల్లి జాతరను నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. గ్రామ ఆరాధ్య దైవం నల్లగొండమ్మతల్లి జాతర పురస్కరించుకుని ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం వీధుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పిడుగుపాటుతో ఆవు మృత్యువాత


పిడుగుపాటు పడడంతో మృతి చెందిన ఆవు

కె.కోటపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.సంతపాలెం గ్రామంలో సోమవారం పిడుగు పడడంతో ఓ ఆవు మృతి చెందింది. బొడ్డు రమణకు చెందిన ఆవును పశువుల పాకలో కట్టగా, సోమవారం సాయంత్రం పాకపై పిడుగు పడింది. ఈ దుర్ఘటనకు ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. పాడిపైనే జీవనం సాగిస్తున్న తాము ఆవు మృతితో ఆధారం కోల్పోయామని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ

రోలుగుంట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలంకాయలపాలెం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. సోమవారం ఆయా పాఠశాలలను సందర్శించారు. అనంతరం జనసేన నేత బెజివాడ వాసు ప్రత్యేకంగా విద్యార్థుల కోసం తయారు చేయించిన ఐడీ కార్డులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్గంలో పయనించి భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా తయారుకావాలని కోరారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించి, వారికి నవోదయ పరీక్షకు తర్ఫీదు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పంచాడ హరి, సీతా గిరి, మనికంఠ, సత్తిబాబు, ప్రసాద్, శివాజీ పాల్గొన్నారు.

జీఎస్టీపై చిత్రలేఖన పోటీలు

రోలుగుంట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీఎస్టీ 2.0పై సోమవారం మండల స్థాయి వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జడ్పీ పాఠశాలలతో పాటు కేజీబీవీకి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి పోటీల్లో 'జీఎస్టీ 2.0-బలమైన భారతదేశానికి కొత్త మార్గం' అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు జరిగాయి. వ్యాసరచన పోటీల్లో మండల స్థాయిలో రోలుగుంట జడ్పీ పాఠశాలకు చెందిన దుర్గాప్రసాద్, చిత్రలేఖన పోటీల్లో కొమరవోలు జడ్పీ పాఠశాలకు చెందిన ఎల్.కావ్య విజేతలుగా నిలిచారు. అనంతరం విజేతలకు ఎంఈవో జాన్ ప్రసాద్, హెచ్‌ఎం శేషగిరిరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగజ్యోతి పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై మాకవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం హైస్కూల్‌లో జీఎస్టీపై వ్యాసరచణ, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు అచ్యుత్‌రావు, మూర్తి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో కంటి వైద్య శిబిరం

కె.కోటపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయంలో సోమవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 50 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. వారిలో పది మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు, జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, సమితి సేవాదల్ కోలా శ్రీను, గోపికృష్ణ, గోపి వెంకటరావు, గజ్జి అప్పలనాయుడు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి మృతిచెందిన వ్యక్తి శ్రీకాకుళం జిల్లా వాసి

పాయకరావుపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెక్కానగర్ సమీపంలో ఆదివారం రైలు నుంచి జారిపడి మృతిచెందిన వ్యక్తి శ్రీకాకుళం జిల్లాకు చెందిన పిలక రాముడు(47)గా తుని ప్రభుత్వ రైల్వే పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించి రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు సోమవారం వివరాలు అందజేశారు. పాయకరావుపేట చెక్కానగర్ వెనుక ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి గుర్తు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన పిలక రాముడుగా గుర్తించారు. ఇతనికి తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాజమహేంద్రవరంలో తాపీపని కోసం విశాఖపట్నం వచ్చి అక్కడి నుంచి రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో రాజమహేంద్రవరం వెళుతుండగా పాయకరావుపేట వద్ద రైలు నుంచి జారిపడి మృతిచెందినట్టు గుర్తించారు. తుని ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వీడని కాజ్‌వే కష్టాలు

- విజయరామరాజుపేట వద్ద పనులు పూర్తికాకుండానే వాహనాలకు అనుమతి
- వర్షంతో బురదగా మారిన కాజ్‌వే
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు



విజయరామరాజుపేట కాజ్‌వే వద్ద స్తంభించిన ట్రాఫిక్



చోడవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డులోని చోడవరం- వడ్డాది మార్గంలో విజయరామరాజుపేట వద్ద వర్షాలకు కొట్టుకుపోయిన కాజ్‌వే వద్ద ట్రాఫిక్ కష్టాలు ఇంకా పూర్తి స్థాయిలో తీరలేదు. వివిధ వర్గాల ఆందోళనలతో సుమారు నెలన్నర అనంతరం కాజ్‌వే పనులు పునరుద్ధరణ పనులు చేపట్టినప్పటికీ, పనులు పూర్తిగా జరగకుండానే కాజ్‌వే పైనుంచి వాహనాలను అనుమతించడంతో కాజ్‌వేపై వాహనాల రాకపోకలకు తరచూ అంతరాయం ఏర్పడుతున్నది. విజయరామరాజుపేట వద్ద కాజ్‌వే పనులు అవుతుండగానే ద్విచక్ర వాహనాలు తిరగడం ప్రారంభించగా, రెండు రోజుల నుంచి ఆర్టీసీ బస్సు లు, ఇతర వాహనాలను కూడా అనుమతించడంతో కాజ్‌వే ప్రమాదభరితంగా మారింది. కాజ్‌వే పైన వేసిన మట్టి వర్షాలకు దిగిపోవడంతో కాజ్‌వే ఎగుడుదిగు డుగా మారిపోయింది. దీంతో ఆదివా రం ఉదయం కాజ్‌వే వద్ద ఓ వ్యాన్ బోల్తా పడింది. కాగా కాజ్‌వేపై క్రషర్ బుగ్గి వేసి రోలింగ్ చేసే పనులు చేపట్టారు. అయితే ఒక పక్క రోలింగ్ జరుగుతుండగానే, మరో పక్క వాహనాలు తిరుగుతుండడంతో కాజ్‌వే పనులు పూర్తిస్థాయిలో సాగడం లేదు. ఇదే సమయంలో వర్షాలు పడుతుండడంతో కాజ్‌వేపై వేసిన మట్టి కొట్టుకుపోతుండడంతో కాజ్‌వే బురదగా మారి వాహనా ల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిం ది. ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా కాజ్‌వేపై వాహనాలు తిరగబడే ప్రమాదం ఉంది. అందుకే వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సి వస్తుండడంతో కాజ్‌వేపై ట్రాఫిక్ నిలిచిపోతున్నది. ఒకటి, రెండు రోజులు విరామం ఇచ్చి కాజ్‌వేను మరింతగా చదును చేసి పటిష్ఠంగా నిర్మించకపోతే కాజ్‌వేపై ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కాజ్‌వే ఎక్కువ రోజులు ఉండే అవకాశం లేదని అంటున్నారు.

క్రైం... crime news

మహిళ హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

చోడవరం/అనంతగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): శారీరక వాంఛ తీర్చేందుకు నిరాకరించిన మహిళను కిరాతకంగా హత్య చేసిన కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం. హరినారాయణ సోమవారం తీర్పు ఇచ్చారు. అల్లూరి జిల్లా అరకులోయ సర్కిల్ పరిధిలోని అనంతగిరి మండలం కాశీపట్నానికి చెందిన కంటా సూరిబాబు(41).. 2017 ఏప్రిల్ 2వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన కొర్లాపు లక్ష్మి అనే మహిళ ఇంట్లో బలవంతంగా ప్రవేశించి తన కోరిక తీర్చాలని బలవంతపెట్టాడు. దీనికి కొర్లాపు లక్ష్మి నిరాకరించి ఇంట్లో నుంచి బయటపడి, ఇంటి సమీపంలో ఉన్న సిరగం రాజారావు, కొటారి సింహాచలం, చేపల ఈశ్వరమ్మలకు సూరిబాబు దురాగతం గురించి చెపుతున్న సమయంలో, సూరిబాబు తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె కడుపులో పొడిచి అక్కడ నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మిని స్థానికులు ఎస్.కోట ఆస్పత్రికి తరలించేసరికి మార్గమధ్యంలో ఆమె మృతిచెందింది. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు సూరిబాబుపై అప్పటి సీఐ సింహాద్రినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసు విచారణలో నిందితుడు సూరిబాబు హత్య చేసినట్టు నిర్ధారణ కావడంతో, అతనికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి హరినారాయణ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో రెండు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో స్పష్టం చేశారు. సాక్షులను సకాలంలోని కోర్టులో హాజరపరచడంలో సహకరించిన జిల్లా ఎస్పీ అమిత్‌బర్ధార్, అరకు సీఐ హిమగిరి, అనంతగిరి ఎస్ఐ శ్రీనివాసరావును న్యాయమూర్తి అభినందించారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసుకు సంబంధించి పరారీలో ఉన్న నిందితుడిని సోమవారం అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ కె.సంతోశ్‌కుమార్ తెలిపారు. జనవరి ఆరో తేదీన ఏఎంఏఎల్ కళాశాల సమీపంలోని ఏలేరు కాలువ వద్ద మూడు కిలోల గంజాయితో నలుగురిని అరెస్టు చేశామని, ఈ సమయంలో ఎలమంచిలి మండలం పెదగొల్లలపాలేనికి చెందిన కోన అప్పలరాజు పరారయ్యాడని చెప్పారు. అతడిని సోమవారం రైల్వే గూడ్స్‌షెడ్డు వద్ద అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రజా సమస్యలు తెలుసుకోవడం తప్పా?

- పోలీసుల తీరుపై మండిపడిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- రాజయ్యపేట వెళ్లకుండా నక్కపల్లి వద్ద అడ్డగింత



సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను పోలీస్ వాహనంలో తరలిస్తున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్లడం తప్పా?ప్రజల కోసం వెళుతున్న ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యమా? అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రశ్నించారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు వ్యతిరేకంగా మండలంలోని రాజయ్యపేటలో 23 రోజుల నుంచి మత్స్యకారులు చేస్తున్న నిరసన దీక్షలకు సంఘీభావం తెలిపేందుకు సోమవారం సాయంత్రం ఆయన నక్కపల్లి వచ్చారు. ఇక్కడి నుంచి రాజయ్యపేట బయలుదేరగా ఆయన ప్రయాణిస్తున్న వాహనాన్ని పోలీసుల ఉపమాక వద్ద అడ్డుకున్నారు. 30 యాక్ట్ అమలులో వున్నందున రాజయ్యపేట వెళ్లడానికి వీలులేదని స్పష్టం చేశారు. ఒకవేళ అక్కడకు వెళ్లదలుచుకుంటే మూడు రోజుల ముందు అనుమతి తీసుకోవాలని చెప్పారు. అనంతరం పోలీసు వాహనంలోకి ఎక్కించుకుని జాతీయ రహదారి వైపు బయలుదేరుతుండగా సీపీఐ నాయకులు ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు వాహనాన్ని ఆపడంతో రామకృష్ణ కిందకు దిగారు. పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మత్స్యకారుల సమస్యలు తెలుసుకుని ముఖ్యమంత్రికి చెప్పాలనే ఉద్దేశంతో రాజయ్యపేట వెళుతుంటే పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఒక ప్రధాన రాజకీయ పార్టీ రాష్ట్ర కార్యదర్శిని హోం మంత్రి నియోజకవర్గంలో పోలీసులు అడ్డుకోవడం చాలా బాధాకరమన్నారు.



విజయవాడలోని తుమ్మపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి స్వచ్ఛ పరిశ్రమ (ఎంఎస్ఎంఈ) పురస్కారాన్ని అందుకుంటున్న సియోంక్ ఫార్మాస్యూటికల్స్ డైరెక్టర్ (ఆపరేషన్స్) జెట్టి సుబ్బారావు, భారీ పరిశ్రమల విభాగంలో ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ ప్లాంట్ హెడ్ బి.ప్రహ్లాదరెడ్డి, స్వచ్ఛ గ్రామ ఆర్గనేజేషన్ అవార్డు అందుకుంటున్న నాతవరానికి చెందిన విలేజ్ ఆర్గనైజర్ కోరిబిల్లి రాణి, ఏపీఎం మొయ్య కనకరాజు

రాష్ట్రస్థాయి జూడో, కుస్తీ పోటీలకు కశింకోట విద్యార్థులు ఎంపిక



ఉమ్మడి జిల్లాస్థాయి జూడో, కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

కశింకోట, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ నెల 4న విశాఖ నగరంలోని గోపాలపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి జూడో, కుస్తీ పోటీల్లో సత్తా చాటారు. జూడో పోటీల్లో బాలుర అండర్-14 విభాగంలో 7వ తరగతి విద్యార్థి ఎస్.పవన్ స్వర్ణ పతకం, అండర్-17 విభాగంలో పదో తరగతి విద్యార్థి జె.రామ్‌చరణ్, సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరి స్వర్ణ పతకాలు, పదో తరగతి విద్యార్థులు వై.కోటేశ్వరరావు, ఎన్.మధు రజత పతకాలు సాధించారు. కుస్తీ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి డి.లోకేశ్, పదో తరగతి విద్యార్థి అబ్దుల్ అజీజ్ షా ఖాదరి స్వర్ణ పతకాలు, పదో తరగతి విద్యార్థి వై.కోటేశ్వరరావు, 9వ తరగతి విద్యార్థి బి.ప్రవీణ్ రజత పతకాలు సాధించారు. వీరు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం ఎన్‌జీవీ ప్రసాద్ తెలిపారు.

పాయకరావుపేట స్కూల్ నుంచి..



రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థినులు పూర్ణ, సోనీలతో హెచ్ఎం భవానీ

పాయకరావుపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో జరుగనున్న రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు పాయకరావుపేట జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. నెల 4న విశాఖలోని గోపాలపట్నంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో ఎ.పూర్ణ (7వ తరగతి), టి.సోని (10వ తరగతి) చక్కటి ప్రతిభ కనబరిచారు. దీంతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా జట్టులో స్థానం సంపాదించారు. వీరిని హెచ్ఎం డీఎస్ భవానీ, పీడీలు ఎం.మీనా, వైడీ శ్యామ్‌కుమార్ అభినందించారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ విజయకృష్ణన్



అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే అర్జీలకు సంబంధించిన సమస్యలను త్వరగా పరిష్కరించి పౌరులకు న్యాయం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో వైసత్యనారాయణరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారులతో స్వయంగా మాట్లాడి సమస్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. అర్జీలను వెంటనే పరిష్కరించాలని, ఒకవేళ వీలుకాని పక్షంలో అందుకు గల కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 188 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో అందే అర్జీలపై ఏడు రోజుల్లో విచారణ పూర్తి చేసి, తగిన పరిష్కారం చూపాలని ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొని పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి సమస్యను ఆలకించారు. ప్రజల సమస్యలను న్యాయపరంగా పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్‌లో 52 అర్జీలు అందినట్టు జిల్లా పోలీస్ కార్యాలయం అధికారులు తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

- విజయనగరం బాలురు, బాలికల జట్లకు ప్రథమ స్థానం



ప్రథమ స్థానం సాధించిన విజయనగరం బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విజయనగరం జిల్లాకు చెందిన బాలురు, బాలిక జట్లు ప్రథమ స్థానం సాధించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోటీల్లో 26 జట్లు పాల్గొన్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన బాలుర జట్టు ప్రథమ స్థానం సాధించగా, ద్వితీయ స్థానం గుంటూరు జిల్లా, తృతీయ స్థానం నెల్లూరు జిల్లా కైవసం చేసుకున్నాయి. అలాగే విజయనగరం జిల్లాకు చెందిన బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించగా, ద్వితీయ స్థానం చిత్తూరు జిల్లా, తృతీయస్థానం గుంటూరు జిల్లా దక్కించుకున్నాయి. విజేతలకు సోమవారం నర్సీపట్నం టౌన్ సీఐ జి.గోవిందరావు ట్రోఫీలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ, నాతవరం టీడీపీ మండల అధ్యక్షులు చిటికెల తారకవేణుగోపాల్, నందిపల్లి రమణ, నాతవరం ఎస్ఐ వై.తారకేశ్వరరావు, ఎంఈవో కృష్ణప్రసాద్, సర్పంచ్ లోచల సుజాత, సాఫ్ట్‌బాల్ సంఘం నాయకులు మామిడి రమణ, ఎంవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'స్వచ్ఛ'తకు ప్రాధాన్యం

... 3వ పేజీ తరువాయి

సహకరించాలన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం కోసం 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యమాన్ని అమలుచేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.

జిల్లా స్థాయి అవార్డులు అందజేత

జిల్లాస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను కలెక్టర్, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్‌ల చేతుల మీదుగా అందజేశారు. ఉత్తమ గ్రీన్ అంబాసిడార్లుగా అనకాపల్లి మండలం మార్టూరు పంచాయతీకి చెందిన ఆర్.అప్పారావు, కె.కోటపాడు మండలం చౌడువాడ పంచాయతీకి చెందిన ఎ.అప్పారావు, అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం పంచాయతీకి చెందిన వి.నూకాలమ్మ, ఎస్.రాయవరం మండలం గుడివాడ పంచాయతీకి చెందిన డి.కాసులు అవార్డులు అందుకున్నారు. ఉత్తమ స్వచ్ఛంద సంస్థల కేటగిరీలో నర్సీపట్నం మున్సిపాలిటీకి చెందిన మూర్తి అప్పారావు, పరిపాటి బాల, జీవీఎంసీ అనకాపల్లి జోన్‌కు చెందిన కశింకోట గోవింద అప్పల స్వామి, స్వచ్ఛ అంగన్‌వాడీల కేటగిరీలో సబ్బవరం మండలం అమృతపురం, చోడవరం మండలం చాకిపల్లి, నక్కపల్లి మండలం ఎన్.నర్సాపురం, నర్సీపట్నం మండలం వేములపూడి కేంద్రాల ప్రతినిధులు అవార్డులు అందుకున్నారు. స్వచ్ఛ బస్టేషన్‌ల కేటగిరీలో నాతవరం బస్టాండు, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల కేటగిరీలో కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం, జిల్లా పంచాయతీ కార్యాలయం, స్వచ్ఛ ఆస్పత్రుల కేటగిరీలో రావికమతం మండలం కొత్తకోట పీహెచ్‌సీ, అనకాపల్లి జిల్లా ఆస్పత్రికి అవార్డులు అందజేశారు. స్వచ్ఛ వసతిగృహాల కేటగిరీలో కశింకోటలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ఇంటిగ్రేటెడ్ బాలికల వసతిగృహం, నర్సీపట్నంలోని బీసీ బాలుర వసతి గృహం, మాడుగుల మండలం తాటిపర్తిలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల హాస్టల్‌కు అవార్డులు అందించారు. స్వచ్ఛ పరిశ్రమల కేటగిరీలో (ఎంఎస్ఎంఈ) అచ్యుతాపురం సెజ్‌లోని మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్, స్వచ్ఛ మునిసిపాలిటీగా నర్సీపట్నం, స్వచ్ఛ రెసిడెన్షియల్ పాఠశాలలుగా నర్సీపట్నంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం, స్వచ్ఛ రైతు బజారు కేటగిరీలో అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ యార్డు, స్వచ్ఛ పాఠశాలల కేటగిరీలో నర్సీపట్నం మండలం వేములపూడి ఏపీఎంఎస్, కె.కోటపాడు మండలం కేజీబీవీ, అనకాపల్లి గవరపాలెం ఎంపీఎల్, పరవాడ మండలం తానాం జీహెచ్‌ఎస్, నక్కపల్లి మండలం వేంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు అవార్డులు అందజేశారు. స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్‌ల కేటగిరీలో ఎలమంచిలి మండలానికి చెందిన సీతారామ స్లమ్ సమాఖ్య, శ్రీసాయిబాబా స్లమ్ సమాఖ్యలకు అవార్డులు దక్కాయి. స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్స్ కేటగిరీలో చీడికాడ మండలం చీడిపల్లి, నక్కపల్లి మండలం డొంకాడ, కశింకోట మండలం గొలుగొండ గ్రామాలకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, డీఆర్‌డీఏ సత్యనారాయణరావు, ఆర్డీఓ షేక్ ఆయీషా, డీపీఓ సందీప్, టీడీపీ నాయకులు మాదంశెట్టి నీలబాబు, సబ్బవరపు గణేశ్ పాల్గొన్నారు.

రోడ్డెక్కిన డ్వాక్రా మహిళలు

... 3వ పేజీ తరువాయి

రెండు డ్వాక్రా సంఘాల సభ్యులు సోమవారం గోవాడలోని స్టేట్ బ్యాంకు ఎదుట ఆందోళనకు దిగారు. బ్యాంకును తెరవనివ్వకుండా మేనేజర్‌తోపాటు సిబ్బందిని అడ్డుకున్నారు. పోలీసులు, స్థానిక రాజకీయ నాయకులు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఇందుకు సంబంధించి పూర్వాపరాలిలా వున్నాయి.

మండలంలోని సింహాద్రిపురం పంచాయతీ పరిధిలోని పలు డ్వాక్రా గ్రూపుల పేరుతో 2024 మార్చిలో అప్పటి వెలుగు వీవోఏ వరలక్ష్మి, సీసీ తాతబాబు కలిసి, నాటి గోవాడ స్టేట్ బ్యాంకు మేనేజర్ సహకారంతో సుమారు రూ.40 లక్షల రుణాలు మంజూరు చేయించారు. ఈ విషయం ఆయా సంఘాల సభ్యులకు తెలియకుండా సొమ్మును బినామీ ఖాతాలకు మళ్లించుకున్నారు. ఈ వ్యవహారం గత ఏడాది నవంబరులో బయటకు పొక్కడంతో దీనిపై డ్వాక్రా మహిళలు ఆందోళన చేశారు. అంతేకాక నిధుల స్వాహాపై పోలీసులకు ఫిర్యాదు చేయగా వీవోఏపై కేసు నమోదు చేశారు. డీఆర్‌డీఏ అధికారులు వెలుగు సీసీ తాతబాబును సస్పెండ్ చేసి అతనిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. రుణాల స్వాహాపర్వానికి సంబంధించి సింహాద్రిపురానికి చెందిన సిద్ధి వినాయక, శ్రీరామ డ్వాక్రా గ్రూపుల మహిళలు, బ్యాంకులో తమకు ఎలాంటి రుణం లేదంటూ నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వాలని కొద్ది రోజులుగా బ్యాంకు అధికారులు, వెలుగు ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా బ్యాంకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో, డ్వాక్రా మహిళలు సోమవారం ఉదయం గోవాడ స్టేట్ బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. బ్యాంక్ మేనేజర్‌తోపాటు సిబ్బందిని లోపలికి వెళ్లనివ్వలేదు. దీనితో బ్యాంక్ మేనేజర్ సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ జోగారావు సిబ్బంది వచ్చి మహిళలతో మాట్లాడారు. కానీ అడ్డుతొలగేది లేదని మహిళలు స్పష్టం చేశారు. దీంతో సీఐ అప్పలరాజు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. బ్యాంకు, వెలుగు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని, బ్యాంకును తెరవనివ్వకుండా అడ్డుకోవడం సరికాదని అన్నారు. అందరూ స్టేషన్‌కు రావాలని సూచించారు. ఎట్టకేలకు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బ్యాంకును తెరిచారు. అప్పటికే సమాచారం అందుకున్న బ్యాంకు ఆర్ఎం, ఇతర అధికారులు గోవాడ వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న డ్వాక్రా సభ్యులు మళ్లీ బ్యాంకుకు వచ్చి అధికారులతో మాట్లాడారు. తమ పేరుతో రుణాలు మంజూరు చేసి, నిధుల స్వాహా జరిగి ఏడాది దాటినా చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇద్దరు మేనేజర్లు మారినా తమకు న్యాయం జరగలేదన్నారు. నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ఈ సర్టిఫికెట్ ఇవ్వకపోతే కొత్తగా రుణం మంజూరుకాదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ అల్లం రామప్పారావు, ఏడువాక లక్ష్మణకుమార్, సత్యారావు తదితర నాయకులు బ్యాంకుకు వచ్చి అధికారులతో మాట్లాడారు. మహిళలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అంతవరకు ఆందోళన విరమించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు.

వెలుగు వీవోఏపై కేసు

గోవాడ స్టేట్ బ్యాంకులో డ్వాక్రా రుణాల స్వాహా వ్యవహారానికి సంబంధించి వీవోఏ వరలక్ష్మిపై కేసు నమోదు చేసినట్టు సీఐ బి.అప్పలరాజు తెలిపారు. ఈ వ్యవహారంలో గోవాడ స్టేట్ బ్యాంక్ మేనేజర్, ఇతర సిబ్బందితోపాటు, వెలుగు అధికారుల పాత్రపైనా విచారణ చేయనున్నటు ఆయన వెల్లడించారు.

తిరుపతి స్పెషల్‌కు ఆదరణ

... 3వ పేజీ తరువాయి

అందుబాటులో వుంటుంది. తిరుమల, ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అనకాపల్లి నుంచి తిరుపతికి థర్డ్ ఏసీ చార్జీ సుమారు రూ.1050 వుండగా, ప్రత్యేక రైలు (హంసఫర్)లో రూ.1,400 పైచిలుకు వుంది. కాగా హంసఫర్‌కు బదులు సాధారణ, సెకండ్ క్లాస్ స్లీపర్, థర్డ్ ఏసీ బోగీలతో వుండే రైలును నడపాలని పలువురు ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేకాక అక్టోబరు వరకే కాకుండా మరో మూడు నెలలు అదనంగా ప్రత్యేక రైలును నడపాలని కోరుతున్నారు.

అన్నదాతకు ఆదా

... 3వ పేజీ తరువాయి

రూ.6,86,400 వుండగా, దీనిపై 12 శాతం జీఎస్టీ రూ.82,368లను రైతులు చెల్లించేవారు. జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించడంతో ఇప్పుడు రూ.34,320 చెల్లిస్తే సరిపోతుంది. ఒక ట్రాక్టర్ కొనుగోలుపై రైతులకు రూ.48,048 ఆదా అవుతున్నది. ఇంకా ట్రాక్టర్ టైర్లు, ట్యూబులపై గతంలో వున్న 18 శాతం జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించారు. ట్రాక్టర్ విడిభాగాలైన బ్రేకులు, గేర్‌బాక్స్ క్లచ్‌లు, స్టీరింగ్, రేడియేటర్, సైలెన్సర్, హైడ్రాలిక్స్, నూర్పిడి యంత్రాలు, వాటి విడి భాగాలపై గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించారు. ఇక వ్యవసాయ అనుబంధ మత్స్య, పశు సంవర్థక రంగాల్లో సాగు యంత్రాలు, స్ప్రింక్లర్లు, బిందు సేద్యం పరికరాలు, చేతిపంపులు, కంపోస్టింగ్ యంత్రాలు, మొబిలిటీ యంత్రాలు, వాటి ఉప ఉత్పత్తులపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. జీఎస్టీ సంస్కరణ వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

జీఎస్టీ పన్ను తగ్గుదల వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాల గురించి రైతులకు వివరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ, పశుసంవర్థక, ఉద్యాన శాఖల అధికారులు 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరుతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణ అమలుకు ముందు, తరువాత ఆయా సామగ్రి, యంత్రాలు, పరికరాల ధరల గురించి రైతులకు అర్థం అయ్యేలా వివరిస్తున్నారు. ఈ నెల 19వ తేదీ వరకు సదస్సులు నిర్వహించనున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

AJC CLASSIFIEDS

CHANGE OF NAME

★ I **MOHAMMED UMMAY HABEEBA** W/o. Mohammed Baba Fakruddin. Previously called MOHAMMED THIMUN HABIBA, R/o. LIG-C-562, Sagarnagar, VSKP - 530045. Andhra Pradesh. Now changed my name MOHAMMED THIMUN HABIBA to **MOHAMMED UMMAY HABEEBA** Henceforth I will be called as **MOHAMMED UMMAY HABEEBA** For all Purpose.
AJV_241729

FLAT FOR SALE

★ **Venkatadri Enclave Madhurwada,** Durga theatre backside, Second floor 1450 Sq.ft. Residential Complex. Attractive Deal 55 Lacs. Ph. **7762025785**.
AJV_241844

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటి